నవతెలంగాణ 1
మెదక్
శుక్రవారం | 26 జులై 2024 | www.navatelangana.com

విద్యార్థులకు మిషన్ శక్తి 100 పై అవగాహన

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా శిశుసంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం నేతృత్వంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, న్యాయ చట్టాలు, విజ్ఞానంతో సహా సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ సేఫ్టీ అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. సమాజంలో మహిళల ప్రాధాన్యం, అభ్యున్నతి, జీవన నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు తదితర అంశాలపై కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ యాదగిరి, పటాన్‌చెరు లేబర్ ఆఫీసర్ వీరేశం డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి పోలీస్ సిబ్బంది, స్కోప్ ఎన్‌జీఓ సరిత, ప్రధానోపాధ్యాయులు ప్రేమావతి,కవి మొగలిమాల,ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ, టీచర్లు, ఆశావర్కలు పాల్గొన్నారు.

కాలుష్య జనాలు వదలడంపై తీవ్ర ఆగ్రహం

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామికవాడలో విచ్చలవిడిగా కాలుష్య జలాలను వివిధ పరిశ్రమలు వదులుతున్నా యంటూ కాజిపల్లి వాసులు, స్థానిక యువకులు తీవ్ర ఆగ్రహం చేశారు. కాలుష్య జనాలతో ప్రవహిస్తున్న కాలువను పరిశీలించి కాలుష్య నియంత్రణ మండలి అధికార విభాగం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తున్న పరిష్కరించాలని కోరారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు ప్రజాపక్షంగా చేపడుతామని కాజీపల్లి జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ బృందం తెలిపారు. మండల పరిధిలోని కాచిపల్లి గడ్డపోతారం అలీనగర్ కిష్టయ్య పల్లి తో పాటుగా గండిగూడెం గ్రామాల పాలిట శాపంగా మారిన కాలుష్య సమస్యను పరిష్కరించడంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ రంగాలకు కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలి



- అర్హులైన పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- ఇందిరమ్మ ఇండ్లకు పది లక్షలు ఇవ్వాలి
- విద్యా, వైద్యం కు మరిన్ని నిధులు కేటాయించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని, గత 10 సంవత్సరాలలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్యం నుంచి బయటపడడం లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుభీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ..72659 కోట్లు కేటాయింపులు చేశారన్నారు. విద్యా వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయి. రాష్ట్రంలో అక్షరాస్యత 66 శాతం దాటడం లేదన్నారు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబడుతున్నారన్నారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సరిపోవన్నారు. విద్యా, వైద్య రంగంలో ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడం వల్ల ప్రయివేటు రంగాలకు ఆకర్షించబడుతున్నారన్నారు. ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం వున్నదన్నారు. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కొరకు పెద్ద ఎత్తున ఆందోళన సాగుతున్నదన్నారు .ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకున్నవారిని తొలగిస్తున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ.5 లక్షలు, దళితులకు రూ.6లక్షలు ఇస్తామని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారు. దీనికి రూ.8424 కోట్లు మాత్రమే కేటాయించారు. వాస్తవానికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలండర్‌ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీలేకుండా రూ.2 లక్షలకు పెంచాలని ఆయన కోరారు.

అరకొర పద్దులు... అంకెల సుద్దులు



- హామీలకు పైసలేవి..?
- సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులు ప్రశ్నార్థకమే
- సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ లేనట్టే
- ఇందిరమ్మ ఇళ్లు కొందరికేనా
- రూ.12 లక్షల దళిత బంధు..మహిళలకు రూ.2500 నిధుల్లేవు
- గొర్రెల స్కీం బందు...గీతన్నకు సేఫ్టీ మోకులెప్పుడు

రాష్ట్ర బడ్జెట్‌లపై విపక్షాల పెదవి విరుపు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్ 'అరకొర పద్దులు... అంకెల సుద్దులు' అన్నట్లుగా ఉందని చెప్పాలి. ఎందుకంటే బడ్జెట్‌లో పొందుపర్చే పద్దులు... అంకెలు అటు ఇటుగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా నిధుల కేటాయింపుల్లేవు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు కనిపిస్తున్నా అవి అవసరాలకు సరిపడ లేవనేది విపక్షాల మాట. ఇందిరమ్మ ఇళ్లు, బోనస్, రైతు కూలీలకు రూ.12 వేల పథకాలకు అరకొరే విదిల్చారు. గొర్రెల స్కీం..సేఫ్టీ మోకుముస్తాదు...రూ.12 లక్షల దళిత బంధు, మహిళలకు రూ.2500, రైతు భరోసా వంటి వాటికి పైసలియ్యలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రత్యేకంగా నిధులేమీ దక్కలేదు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులకు నిధుల్లేవు. సింగూరు కాల్వలు, ఆధునీకరణ పట్టలేదు. సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ ప్రస్తావన లేదు. నిధుల్లేక నీరసిస్తున్న మున్సిపాలిటీలు, పంచాయతీలకు అదనపు కేటాయింపుల్లేవు. మంజూరైన రోడ్లు, భవనాలకు మొక్కుబడి నిధులే. విక్రమార్కుడి బడ్జెట్ పై వామపక్షాలు, బీఆర్ఎస్, బీజేపీలు మండిపడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం శాసన సభలో రూ.291159 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగానికి పెద్ద మొత్తంలో నిధులు చూపారు. ఆ తర్వాత వైద్యం, విద్య, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న ధాన్యానికి బోనస్, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం, పంటల బీమా ఇలా అనేక రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులు, ఉమ్మడి మెదక్ జిల్లాకు దక్కిన వాటాను పరిశీలిస్తే... హామీలకు పైసలియ్యలేదనేది స్పష్టమవుతోంది.

ఇందిరమ్మ ఇళ్లు అరకొరేనా

ఇళ్లులేని పేదలందరికీ రూ.5 లక్షల వ్యయంతో ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో నిధులివ్వలేదు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను కట్టిస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 నియోజకవర్గాలున్నాయి. అంటే 35 వేల ఇళ్లు మాత్రమే ఇస్తారు. అయితే ప్రజా పాలన కార్యక్రమంలో ఇళ్లులేని పేదలు తమకు ఇళ్లు మంజూరు చేయాలని సంగారెడ్డి జిల్లాలోనే 318345 దరఖాస్తు చేశారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ మరో 2.50 లక్షల దరఖాస్తులొచ్చాయి. వీరందరికీ సొంతింటి కళ నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో నిధుల్లేవనేది స్పష్టమవుతోంది. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసేందుకు కూడా నిధులిచ్చే విషయంలో స్పష్టత ఇవ్వలేదు.

మున్సిపాలిటీలు, పంచాయతీలు

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు నిధుల కొరత కనిపిస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 17 మున్సిపాలిటీలున్నాయి. వీటికి ప్రతి నెలా రావాల్సిన రూ.25 కోట్ల నిధులు మూడు నెళ్లకోసారి ఇస్తున్నారు. సంగారెడ్డి, తెల్లాపూర్, ఆందోల్, నర్సాపూర్, రామాయంపేట, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల ఇతర మున్సిపాలిటీలకు రూ.25 నుంచి రూ.50 కోట్ల వరకు గతంలో మంజూరు చేశారు. పట్టణాల్లో పార్కుల సుందరీకరణ, డ్రైయినేజీ, సమీకృత మార్కెట్లు, రోడ్లు, భవన నిర్మాణాలకు సరిపడ నిధులివ్వలేదు. ఉమ్మడి జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో రావట్లేదు. పాలక వర్గాల్లేక, నిధుల్లేక కనీసం కార్మికుల జీతాలు కూడా ఇవ్వట్లేదు. పట్టణాలు, గ్రామాల్లో విస్తరించిన కాలనీలకు మౌళిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత వెంటాడుతోంది.

సంక్షేమానికి మొక్కుబడి నిధులేనా

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో మాత్రం మొక్కుబడి కేటాయింపులే చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ 20 శాతం, బీసీలు 56 శాతం వరకు ఉన్నారు. దళిత బంధు కింద రూ.12 లక్షలిస్తామన్నారు. ప్రత్యేకంగా నిధులివ్వలేదు. గీతన్నలకు సేఫ్టీ మోకుముస్తాదుల్ని ఉచితంగా ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.68 కోట్లే విదిల్చారు. నీరా ఉత్పత్తులకు అంతంతే. బీసీల్లో అత్యధికంగా ఉన్న యాదవులకు ఇచ్చే సబ్సిడీ గొర్రెల స్కీంను బంధు పెట్టిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏమిటో చెప్పలేదు. ఉచిత చేప పిల్లలు, ఇతర పథకాలకూ నిధులు పెంచలేదు. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీల కోసం నిధుల్ని ఇచ్చిందేమీలేదు. 11 ఫెడరేషన్లు, ఎంబీసీల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలనే డిమాండ్ పట్టలేదనే చర్చ ఉంది.

సాగునీటి ప్రాజెక్టుల ఉసెత్తలే

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు సాగునీరిచ్చే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన లేదు. ఈ రెండు లిఫ్టులు పూర్తి చేసి సింగూరు నుంచి 20 టీఎంసీల నీటిని మళ్లించి 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని గత ప్రభుత్వం రూ.2653 కోట్లతో మంజూరు చేసింది. టెండర్లు ఖరారు చేసి శంఖుస్థాపన చేసింది. ఈ ప్రభుత్వం ఆ పథకాలను పక్కన పెట్టింది. సింగూరు కాల్వలు, ప్రాజెక్టు ఆధునీకరణ, సిద్దిపేట జిల్లాల్లోన పలు జలాశయాల సుందరీకరణ, కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నా నిధులు రాలేదు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోనూ అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

సంగారెడ్డికి మెట్రో విస్తరణ..?

మెట్రో ప్రాజెక్టు విస్తరణ చేస్తామని ఎన్నికల్లో చెప్పారు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇస్నాపూర్ వరకు విస్తరిస్తామని చెబితే కాంగ్రెస్ నాయకులు సంగారెడ్డి వరకు పొడగిస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి వరకు మెట్రో లైన్ వేసేందుకు బడ్జెట్‌లో నిధుల ప్రస్తావనేది రాలేదు.

హామీలకు నిధుల్లేవన్న విపక్షాలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు అవసరమైన నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించలేదని విపక్షాలు మండిపడ్డాయి. సీపీఐఎం, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బడ్జెట్‌పై స్పందించారు. వివిద రంగాలకు చూపిన కేటాయింపుల్లో కొత్తదనమేమీ లేదని పేర్కొన్నాయి. ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల్లేమీ కేటాయించకపోవడాన్ని తప్పుపట్టాయి.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

30న చలో హైదరాబాద్ జయప్రదం విజయవంతం చేయాలి
సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, వారిని పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 30వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బర్మ కొమురయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని మల్టీపర్పస్ విధానం రద్దు చేస్తామని పొందుపరిచారని, కాని అటువంటి ఊసే లేదన్నారు పెరిగిన ధరలతో కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.26వేలు వేతనాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామంలో పారిశుధ్య పనుల్లో ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగితే ప్రమాద బీమా సౌకర్యం రూ.10లక్షలు ఇవ్వాలని అందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులు పంచాయతీ బడ్జెట్ నుంచి ఇన్సూరెన్స్ చేయించాలని వారు డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల నర్సయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్, జిల్లా కోశాధికారి రాజనర్సు, జిల్లా కమిటీ సభ్యులు దేవులపల్లి రాజమౌళి, ప్రభాకర్, శ్రీనివాస్, సురేందర్, ప్రశాంత్ కుమార్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల్లో రోడ్డుపై వెళ్లేదేలా..

నవతెలంగాణ-కోహిర్



మండల పరిధిలోని కోహిర్ నుంచి పైడిగుమ్మల మరియు పైడిగుమ్మలతాండా రోడ్లపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. కాబట్టి అధికారులు స్పందించి.. మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రోడ్లు బాగు చేయండి సారూ..



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మండలంలోని గంగాపూర్ గ్రామంలో రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు వాపో తున్నారు. వర్షం పడిన ప్రతీసారి మట్టి రోడ్లు మొత్తం బురదమయంగా మారి.. నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుసార్లు బైక్‌లు బురదలో స్కిడ్ కావడంతో పలువురికి గాయాలు కూడా అయ్యాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

ఎవరెస్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్, పీసీబీ అధికారులకు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



కాలుష్యం వెదజల్లుతూ పంటలను నాశనం చేస్తున్న ఎవరెస్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్, పీసీబీ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు మాట్లాడుతూ.. సదాశివపేట మండలం ఆరూర్ గ్రామ పరిధిలోగల ఎవరెస్ట్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వెదజల్లే కాలుష్య జలాల వల్ల పెద్ద గోపులారం, ఆరుర్, కోనాపూర్,నాగులపల్లి, ఆత్మకూర్ కాలువల గుండా మంజీరాలో కాలుష్య జలాలు కలుస్తున్నాయన్నారు. దాంతో ప్రజలతో పాటు జంతువులు, చేపల మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. వర్షం పడుతున్నప్పుడు సదరు పరిశ్రమ యాజమాన్యం యథేచ్ఛగా కాలుష్య జలాలను వదులుతున్నదని ఆరోపించారు. వెంటనే సదరు పరిశ్రమపై ప్రభుత్వం, పీసీబీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్, ప్రజాసంఘాల నాయకులు జయరాజ్, మాణిక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

పీఆర్సీ అమలు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలని, పీఆర్సీ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ (టీఎస్‌యూ టీఎఫ్) సంగారెడ్డి మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం సంగారెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, ఫసల్వాది జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే డీఏ ప్రకటించాలని కోరారు. రాష్ట్ర రెండో పీఆర్సి కమిటీ నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి 30 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలన్నారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ ఇతర బిల్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి మండల నాయకులు కమలాకర్‌రావు, సూర్యనారాయణ శర్మ, కిషన్ పవర్, వినయ్ కుమారి, రాజు,సైమన్ పాల్గొన్నారు.

ఇంటి మూడో ఫ్లోర్ పైకప్పుపై కోళ్ల ఫారం..

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పంచాయతీకి ఫిర్యాదు.. వెంటనే తొలగించాలని హెచ్చరిక

నవతెలంగాణ-గుమ్మడిదల



మండల పరిధిలోని అన్నారం గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా ఇంటి మూడో ఫ్లోర్‌పై పౌల్ట్రీ ఫారాన్ని సుమారు ఐదు నెలల నుంచి నిర్వహిస్తున్నారు. అయితే దుర్వాసన ఎక్కువగా వస్తుండడంతో.. పక్కనే ఉన్న వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి పైకప్పు పైకి వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది. సుమారు 1000 కోళ్లతో పౌల్ట్రీ ఫారం నడుపుతున్నట్టు గమనించిన ఆయన.. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే తొలగించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్కడ వొడాఫోన్ టవర్ నిర్మాణం చేపడుతున్నారని.. కనీసం వాటికి కూడా ఇలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారులతో ఎలాంటి పౌల్ట్రీ ఫారం సంబంధించిన వస్తువులు కానీ కోళ్లు కానీ వోడాఫోన్ టవర్ వస్తువులను అక్కడ ఉంటే.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిగణంలోకి తీసుకొని గురువారం సాయంత్రంలోపు పూర్తిగా ఖాళీ చేయాలని.. లేని యెడల సంబంధిత శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు అయ్యేటట్టు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

108 ఉద్యోగులకు లైఫ్ సేవియర్ అవార్డు

- అవార్డును అందజేసిన 108 సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఎం.ఏ ఖాలిద్

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ద్వారా నడపబడుతున్న 108 అత్యవసర అంబులెన్స్ సేవల్లో ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు చెందిన మెడికల్ టెక్నీషియన్ ప్రశాంత్, పైలట్ పండరిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందుకుగాను గురువారం 108 సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి (తెలంగాణ స్టేట్ హెడ్) ఎం.ఏ ఖాలిద్ హైదరాబాదులో108 సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్, పండరిలకు లైఫ్ సేవియర్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుంటారని తెలిపారు. గాయపడిన క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి తీసుకొని గాయాలు తగిలిన చోట కట్లు కట్టి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షిస్తారని చెప్పారు. తగిన మోతాదులో ఆక్సిజన్ అందిస్తూ బిపి, షుగర్ లెవెల్స్, నాడీ పరీక్ష, గుండె యొక్క లయ స్థితి లాంటివి పరీక్షలు నిర్వహించి పేషెంట్ యొక్క సమాచారాన్ని హైదరాబాద్ కాల్ సెంటర్ లోని డాక్టర్ కు ఫోన్ కాల్ లో సమాచారం అందిస్తారన్నారు. వారి సూచనలను పాటిస్తూ కావాల్సిన మందులను ఇస్తారని చెప్పారు. ఒకవేళ పేషంట్ అపస్మారక స్థితిలోకి వెళ్ళితే సిపిఆర్ చేస్తూ గోల్డెన్ అవర్‌లో త్వరితగతిన ఆసుపత్రికి చేరుస్తారని తెలిపారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడంలో కీలకపాత్రను పోషించిన మెడికల్ టెక్నీషియన్, పైలట్లకు ప్రతి త్రైమాసికంలో లైఫ్ సేవియర్ అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, జిల్లా మేనేజర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి

ఈఎస్ఐ, పీఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు రాష్ట కార్యదర్శి బి.మల్లేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26000లు ఇవ్వాలని, ఈఎస్ఐ పీఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆశా వర్కర్స్ శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 28 వేల మంది గత 18 ఏండ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీములు, సర్వేలు, పేదలకు వైద్యం అందించే దాంట్లో ముందున్న ఆశాలకు.. కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు. వారికి పనిభారం పెరిగిందన్నారు. అనేక రకాల సర్వేలు చేస్తూ.. ప్రభుత్వానికి సహకారాలు అందిస్తూ, గర్భిణీ స్త్రీలను, చిన్న పిల్లలకు పోషణ విషయంలో జాగ్రత్తలు సూచిస్తూ పనిచేస్తున్నా వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదన్నారు. వేతనాలు పెంచాలని పోరాటం చేస్తే తాత్కాలికంగా హామీలు ఇస్తున్నారు తప్ప పరిష్కారం లేదన్నారు. ఆశా వర్కర్స్ అందరూ రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమించి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, కోశాధికారి కే. రాజయ్య, ఆశ యూనియన్ నాయకులు వరలక్ష్మి, వీరమని, ప్రశాంతి, గంగా, శశికళ, హైమావతి, లక్ష్మి, విమల, నరసమ్మ జ్యోతి, సువర్ణ, ఆశ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, సామాజిక నీతి సూర్యుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీరా హోటల్లో ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చంద్ర మాదిగ అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెస్పీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ హాజరై మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సంస్థాగత నిర్మాణం గ్రామ గ్రామాన చేపట్టాలన్నారు. ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలు ప్రతీ గ్రామంలో నిర్మించి ఆవిష్కరణ చేయాలన్నారు. 30 ఏళ్ల వర్గీకరణ పోరాటం చివరి దశకు వచ్చిందని వచ్చేనెల ఆఖరి వారంలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రతీ నాయకుడు బాధ్యతగా పటిష్టమైన నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చంద్ర, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీత, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు క్రిష్ణ, గౌరవ అధ్యక్షులు వీరయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు నాయకులు నవీన్, ప్రసాద్, ఏసు, బిక్షపతి, సత్యం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలే లక్ష్యంగా బడ్జెట్

నవతెలంగా-కంగ్టి



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో రైతు, విద్య, సంక్షేమ బడుగు బలహీన వర్గాల ప్రయోజనాలే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పెద్దపీట వేశారని కంగ్టి మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్ పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం అన్ని వర్గాల సంతృప్తి పరిచిన రాష్ట్ర బడ్జెట్లో అన్ని రంగాలకు సంబంధించిన సమస్యలను అంశాలను పరిగణనలకు తీసుకొని రూపొందించిన భారీ బడ్జెట్ను ప్రజలందరూ కూడా ఆనందంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి రావాల్సిన బడ్జెట్ ఇవ్వకుండా తీవ్రమైన నష్టాన్ని కలిగించిందన్నారు. బీజేపీకి తెలంగాణ రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్లో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. బీజేపీలో గెలిచిన ఎంపీలు తలదించుకోవాల్సిన సమయం వచ్చిందని, బీజేపీ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట

నవతెలంగాణ-గుమ్మడిదల



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారని.. రైతును రాజుగా చూడాలన్న ఆకాంక్ష కేవలం కాంగ్రెస్తోనే సాధ్యమని గుమ్మడిదల మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి అన్నారు. ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయరంగాన్ని మరింత పటిష్టత పరిచారన్నారు. శాసనసభ సమావేశాల అనంతరం రైతు భరోసాను అమలు చేయనున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరొకసారి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

కేతకీలో అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆలయంలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి ఆలయ అధికారులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేయించారు. అనంతరం శాలువ, పూల మాలలతో ఘనంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డిఓ ఎస్ రాజు, స్థానిక తహశీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో సుధాకర్, ఆర్ఐ రామారావు, ఆలయ సిబ్బంది శివకుమార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రైతు రుణాలన్నీ మాఫీ చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో ఉన్న 16 సీడెడ్ వ్యవసాయ సంఘాల్లో ఉన్న 8000 మంది రైతుల రుణాలు వెంటనే మాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం రైతులతో కలిసి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిలా వ్యాప్తంగా ఎస్బిఐకి అనుబంధంగా ఉన్న 16 సీడెడ్ వ్యవసాయ సహకార సంఘాల రైతుల రుణాలు మాఫీలు గాక.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం న్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయం తీసుకొని వారి రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, కుమారు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి దామోదర సంతాపం

నవతెలంగాణ-చౌటకూర్

కంది మండలంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వచౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామానికి చెందిన కాశపాగ నవీన్, కాశపాగ సందీప్, పుల్కల్ మండలం గోంగ్లూరు గ్రామానికి చెందిన సంటి పిల్ల అభిషేక్‌లు మృతి చెందిన విషయం విధితమే. కాగా ప్రమాద విషయం తెలి యగానే.. మృతుల కుటుంబ సభ్యులతో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. చిన్న వయసులో ముగ్గురు యువకులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పటాన్‌చెరు వరకు మెట్రోరైల్ విస్తరణకు నిధులు కేటాయించడం హర్షనీయం



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్ర బడ్జెట్‌లో మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో రైలు విస్తరణకు నిధులు కేటాయించడం పట్ల స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి కృత జ్ఞతలు తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియో జకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాల కోసం మెట్రో రైల్ విస్తరణ అత్యంత ఆవశ్యకమన్నారు. అందుకు అనుగుణంగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయిం చడం జరిగిందన్నారు. త్వరితగతిన పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు.

కేటాయింపులు కాదు.. ఆచరణలో సాధ్యం చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

బడ్జెట్‌లో కేటాయింపులు కాదు ఆచరణలో అమలు పరచాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి బి.రామచంద్ర అన్నారు. గతంలో కూడా ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు కోట్ల కొద్ది కేటాయింపులు చేశారే కానీ.. వాటిని వినియోగించడంలో విఫలమ య్యారన్నారు. వ్యవసాయ కూలీల సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచితే బాగుండేదన్నారు. ఈ ప్రభుత్వం కార్మికులు కర్షకులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ లోన్‌లు విడుదల చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఎస్టీ కార్పొరేషన్ లోన్లను విడుదల చేయాలని కార్పొరేషన్ చైర్మెన్‌కు బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షులు రమేష్ చౌహన్ గురువారం వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ ప్రాంతంలో గిరిజనల కార్పొరేషన్ లోన్లు పెండింగ్‌లో ఉన్నాయని.. వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు



నవతెలంగాణ-జోగిపేట

ప్రతీయేడు లాగానే ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని జోగిపేటలోని శివాజీనగర్ కాలనీలో 12వ వార్డ్ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజ్ (నాని) ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం బోనాలు నిర్వహించారు. డోలు వాయిద్యాలు, పోతురాజుల నృత్యాలతో కాలనీ నుంచి పోచమ్మ దేవాలయం వరకు బోనాల ఊరేగింపు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వులువల సత్తయ్య, వులువల రమేష్, నర్ర భీమ్ రాజ్, వులువల శ్రీనివాస్, దుర్గేష్, మల్లేశం, శివకుమార్, బందిగి శ్రీనివాస్ ,నర్ర సురేష్, అల్లె రాకేష్, వు రవీందర్, ఉలువల పరుశురాం, మహేందర్, మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

కదిరి కృష్ణపై కేసులు పెట్టడం సరికాదు



నవతెలంగాణ-సంగారెడ్డి

వెంకటేశ్వర స్వామి సుప్రభాతం పైన అనుచిత వ్యాఖ్యలు చేశారని బహుజన మేధావి హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ కదిరే కృష్ణ పై వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు పెట్టడం సరికాదని బహుజన సేన జిల్లా కన్వీనర్ అనిల్ బౌద్ధ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృత భాషలో ఉన్న వెంకటేశ్వర సుప్రభాతాన్ని తెలుగులో అనువదిస్తూ అర్థం చెప్పే ప్రయత్నం చేస్తూ కదిరే కృష్ణ వివరణ ఇచ్చారే గాని ఎవరిని నిందించలేదు, దూషణ చేయలేదన్నారు. మొత్తం వీడియోలు చూపించకుండా కాంట్రవర్సీ చేసే అంశాలను వీడియో క్లిప్ ను కట్ చేసి దానిని సోషల్ మీడియాలో ప్రచారం చేసి తన వ్యక్తిగత ఇమేజ్ వాడుకోవాలని చూస్తూ హిందూ సమాజాన్ని రెచ్చగొడుతున్నారు ఆరోపించారు. మనోభావాలు దెబ్బతింటే క్షమించండి అని కదిరే కృష్ణ క్షమాపణ కూడా కోరినట్టు గుర్తు చేశారు. కానీ కదిరే కృష్ణను నరకండి, కొట్టండి చంపండి, భౌతిక దాడులు చేయండి అంటూ చీకోటి ప్రవీణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్ల రాష్ట్రంలో, దేశంలో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లె ప్రమాదం ఉందన్నారు. వెంటనే చీకోటి ప్రవీణ్ పైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బహుజన సేన, ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

మార్కెట్ సూపర్వైజర్ పండరికి సన్మానం



నవతెలంగాణ-జోగిపేట

జోగుపేట మార్కెట్ కమిటీ సూపర్వైజర్ పండరి వట్టిపల్లి మార్కెట్ కమిటీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మార్కెట్ సెక్రటరీ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆయనకు శాలువా పూల మాలతో సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. గత ఆరేండ్లుగా జోగిపేట మార్కెట్ కమిటీలు విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా చక్కటి సేవలను అందించారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది మురళి, సరళ, చంద్రశేఖర్, డాక్టర్ సాబ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త మహమ్మద్ అబ్జల్ మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త మహమ్మద్ అఫ్జల్(72) బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అఫ్జల్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. కాగా బుధవారం రాత్రి స్థానిక అరఫాత్ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి పురాహనోద్దీన్ షా ఖాద్రి స్మశాన వాటికలో అఫ్జల్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు తంజీమ్, ఖాజామీయా, ముత్యాల చందులతోపాటు పట్టణపుర ప్రముఖులు పాల్గొన్నారు. టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ఎండగట్టాలి

నవతెలంగాణ-జిన్నారం

కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలు ఎండ గట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిన్నారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షులు కొత్తకాపు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రతీ ఒక్క కార్యకర్త పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, నాయకులు దోమడుగు రమేష్, పి సుధాకర్,వెంకటేష్, కృష్ణ, అశోక్, మహేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, మహేష్, వీరేష్, అశోక్, భార్గవ్ ప్రదీప్, రాజు పాల్గొన్నారు.

సంగారెడ్డి, జహీరాబాద్‌లో ఈఎస్ఐ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలి

- పరిశ్రమలు పెరుగుతున్నా కార్మికులకు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం లేదు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెడుతున్నా.. ఇక్కడి కార్మికులకు మాత్రం సరైన వైద్య సదుపాయాలు అందడం లేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సంగారెడ్డి జహీరాబాద్ ప్రాంతంలో నూతనంగా ఈఎస్ఐ హాస్పిటల్స్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం జయారాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట ప్రాంతాలు పట్టణ పరంగా విద్యాసంస్థలు, హాస్టిటల్స్, షాపింగ్ మాల్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రతిషాత్మక జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటుతో మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయని అందులో వేలాదిమంది కార్మికులు పని చేసున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు, ఉద్యోగాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే జహీరాబాద్‌లో సుమారుగా 3000 వేల మంది ఈఎస్ఐ కార్డు హెరీల్డర్స్ ఉండి.. ప్రతి నెల సుమారుగా రూ.23 నుంచి 25 లక్షలు ఈఎస్ఐకి కార్మికుల నుంచి కాంట్రి బ్యూషన్ వస్తుందన్నారు. ఇక్కడ కేవలం డిస్పెన్సరీ మాత్రమే ఉండగా.. ఇక్కడ విధులు నిర్వహించే ఒకే ఒక్క డాక్టర్ కూడా డిప్యూటేషన్‌లో ఉన్నారన్నారు. ఇక్కడికి రోజుకు 175నుంచి 200 మంది రోగులు వస్తుంటారన్నారు. ఇక్కడ ఆసుపత్రి లేకపోవడంతో జహీరాబాద్ నుంచి పటాన్‌చెరు, ఎర్రగడ్డ ఈఎస్ఐ హాస్పిటల్‌కు పోవాల్సి వస్తుందన్నారు. దాంతో కార్మి కులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నార న్నారు. సంగారెడ్డి, జహీరాబాద్లో డిస్పెన్షనరీ హాస్పిటల్ లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుత న్నార న్నారు. సంగారెడ్డి, పటాన్చెరు, బొల్లారంలో ఈఎస్ఐ స్పెన్షన రీలు లోకల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్, నాయకులు నర్సింలు, కృష్ణ, ప్రభాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను పొగుడుతూనే.. వెన్నుపోటు పొడిచారు

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే.. రైతులను పొగుడుతూనే వెన్నుపోటు పొడిచినట్టుగా ఉన్నదని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను మోసం చేసింద న్నారు. బడ్జెట్లో ముఖ్యమైన పథకాల ప్రస్తావన లేదన్నారు. రైతులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ఉందన్నారు. ప్రభుత్వానికి పాలసీ లేదని బడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతున్నదన్నారు. బడ్జెట్ ప్రసంగం పూర్తిగా ఒక కథలాగా ఉన్నదని ఎద్దేవా చేశారు.



గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో పాండు

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ గురుకుల పాఠశాలను జోగిపేట ఆర్డీవో పాండు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందోల్ తహసీల్దార్ భాస్కర్ కుమార్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. వంటశాలలో తిరిగి.. భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం సీజన్ కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ గ్రేసి, లెక్చరర్ డిబి. సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

సహారాలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం

సహారా సంస్థ సెక్రటరీ శంకర్ మటం

సంగారెడ్డిలో నూతన ఆసుపత్రి ప్రారంభం





నవతెలంగాణ-సంగారెడ్డి

నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలని ఉద్దేశం తో సహారా ఆసుపత్రిని సంగారెడ్డి పట్టణంలోని జిల్లా కోర్టు పక్కన ప్రారంభించినట్టు సహారా సంస్థ సెక్రటరీ శంకర్ మటం అన్నారు. సహారా సంస్థ అధ్యక్షురాలు జ్యోత్స్న మడపతి రిబ్బన్ కట్ చేసి సహారా హాస్పిటల్‌ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సహారా హెల్త్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ సెక్రటరీ శంకర్ మటం మాట్లాడుతూ.. సహారా హెల్త్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గత పదేండ్లుగా తెలంగాణ, ఒరిస్సా, జమ్మూ ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా హెల్త్ యాక్సిస్బిలిటీ, డిజేబలిటీ, ఇంక్లూజివ్, రూరల్ డెవలప్మెంట్ తదితర అంశాలపై పనిచేస్తున్నామన్నారు. సంగారెడ్డి పట్టణంలోని హాస్టల్ గడ్డలో ప్రైమరీ రిహాబిటేషన్ కేంద్రం ను కూడా ఏర్పాటు చేసి గత ఐదు సంవత్సరాలుగా 100 మంది పిల్లలకు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, బిహేవియర్ థెరపీ లాంటివి అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నందు ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ తో కలిసి ఒక ఫ్రీ రిహాబిటేషన్ సెంటర్ నిర్వహిసున్నామన్నారు. సహారా ఎంక్లోజివ్ హాస్పిటల్‌లో ఎంక్లోజివ్ టెర్మినేషన్ అంటే ఆరోగ్య సౌకర్యాలకు దూరంగా ఉన్నవారు, హెల్త్‌కేర్ హెూల్‌లోకి తీసుకు రావాలన్నారు. సహారా స్వచ్ఛంద సంస్థ లాభాపేక్ష లేని సంస్థ అని.. సీనియర్ సిటిజనులకు, ఎదుగుదల లోపం ఉన్నవారికి సేవలం దించాలన్న ఉద్దేశంతోనే ఏర్పాటు చేశామన్నారు. వాటితోపాటు అన్ని రకాల సేవలు అందరికీ అందుబాటులో ఉంచుతామన్నారు. డబ్బులు కట్టగలిగే వారి నుంచి వచ్చే లాభాన్ని డబ్బులు కట్టలేని వారికి ఉపయోగించి సేవలందిస్తామన్నారు. దీన్నే డెవలప్మెంట్ సెక్టార్‌లో క్రాస్ సబ్సిడైజేషన్ అంటారన్నారు. సంగారెడ్డిలో ఆధునిక పరికరాలతో సీఆమ్, వెంటిలేటర్స్, ఐసీయూ అన్ని వసతులతో ఏర్పాటు చేశామన్నారు. యువత మత్తు పదార్థలకు, మందుకు, గంజాయికి అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నా రన్నారు. వారికి సహారా స్వచ్ఛంద సంస్థ ద్వారా చికిత్స అందించ డానికి డిఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కాబట్టి ఇక్కడి ప్రజలు ఈ సౌకర్యానలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.ధీమంత్‌రెడ్డి (న్యూరోలోజిస్ట్), డా.కిరణ్ జిషి (ఆర్థోపెడిక్‌సర్జన్), డా.శ్యాం మనోహర్ (ఈఎన్‌టి సర్జన్) డా.అక్షిత ముదిగొండ (జనరల్ ఫిజిషి యన్), డా.శ్రేయ దేశాయ్ (గైనకాలజిస్ట్), డా.అఖిల్ (సైకియాట్రిస్ట్), డా.అక్షర (పిడియాట్రిషన్)తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వ బడ్జెట్..



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. ప్రజా బడ్జెట్ అని టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. అన్ని వర్గాల సంక్షే మానికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రజాసేవకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు బడ్జెట్ కనిపిస్తున్నదన్నారు. ఈ బడ్జెట్‌తో అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమన్నారు.

అనుకున్నది నిరూపిస్తున్నాం..

- డాక్టర్ ఉజ్వల్ రెడ్డి



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్లో కేటాయింపులు జరిగాయి. ఇది ప్రజలకు సేవ చేసే బడ్జెట్. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా రైతుల పక్షాన నిలిచిందని మరోసారి నిరూపణ అయింది.

హామీలు నెరవేర్చే బడ్జెట్..

- మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్



తీది ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బడ్జెట్. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కలిసి ఎంతో కృషిచేసి బడ్జెటును రూపొందించారు. అన్ని వర్గాలతో పాటు రైతులకు, నిరుపేదల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రజల నడ్డి విరిచే బడ్జెట్..



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల నడ్డి విరిచే విధంగా ఉన్నదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలకు నిరాశే మిగిల్చిందన్నారు.

- ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

- దిశెట్టి పాటిల్, బీజేపీ నాయకులు



ఈ బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ కోశానా అమలుపరిచే విధంగా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది.

ఈ బడ్జెట్‌తో మైనార్టీల సంక్షేమం ఎలా సాధ్యం

- మహమ్మద్ కీసర్ యాఫై



మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తుంటే.. వారి సంక్షేమం ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదు. మైనార్టీల సంక్షేమానికి గత ప్రభుత్వం పెద్దపీట వేయడంతో పాటు.. మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేసింది. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన అనంతరం గురుకులాల పరిస్థితి అధ్వానంగా మారు తున్నది. బడ్జెట్లో నిధుల కేటాయింపు చూస్తుంటే రాను రాను మైనార్టీ సంక్షేమం కుంటూపడేలా ఉన్నది.

మహిళల రక్షణ, భద్రత అందరి బాధ్యత

- జిల్లా న్యాయ సేవాదికర సంస్థ సెక్రటరి, సీనియర్ జడ్జి రమేశ్
- జోగిపేట డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు



నవతెలంగాణ-జోగిపేట

మహిళల రక్షణ, భద్రత అందరికీ బాధ్యత అని జిల్లా న్యాయ సేవాదికర సంస్థ సెక్రటరి, సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాదికర సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ,మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమాన్ని జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. పిల్ల ల సంరక్షణ మరియు రక్షణ చట్టం (జువైనెల్ జస్టిస్ యాక్ట్), బాల్య వివాహ నిషేధ చట్టం, గృహహింస చట్టం, వరకట్న నిషేధ చట్టం, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం మరియు కొత్త చట్టాల మార్పులను వివరించారు. అందరికీ సమానమైన హక్కులు ఉన్నాయని అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి జరగాలని సూచించారు. లింగ సమానత్వం, జీవిత లక్ష్యాలను ఛేదించే మార్గాలు తెలియచేశారు.అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు మాట్లాడుతూ.. 18ఏండ్ల లోపు బాలికలపై లైంగిక నేరాల నుంచి రక్షణగాను పోక్సో చట్టం పనిచేస్తుందని తెలిపారు. షీ టీమ్స్, భరోసా, సఖి, ఉమెన్స్ వింగ్ మహిళల రక్షణ భద్రత కొరకు పనిచేస్తున్నాయని తెలియజేశారు. సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు సోషల్ మీడి యా అతిగా వాడడం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివ రించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కళాశాల ప్రిన్సిపల్ రమేష్, డిసిఆర్బి రమేష్ ,జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల కరాటే మాస్టర్ అసభ్య ప్రవర్తన

- ముత్తంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కరాటే మాస్టర్ నిర్వాహకం
- ఎంఈఓకు గ్రామస్తుల వినతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరాటే మాస్టర్.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్తులు ఎంఈఓ పిపి రాథోడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు వెంకటేశులు మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్.. పాఠశాలలో కరాటే క్లాస్ పేరుతో క్లాసుకు హాజరు కావాలని విద్యార్థులకు అల్టిమేటం ఇస్తున్నాడన్నారు. లేకుంటే విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమని.. ఊర్లో తనకు పలుకుబడి ఉన్నదని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. కరాటే మాస్టర్ కుమార్‌కు మాజీ రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే పేరుతో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఈ కరాటే మాస్టర్ మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నాడని.. ఆ విషయం అప్పుడే గ్రామంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. అలాంటి కరాటే మాస్టర్ కుమార్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



నవతెలంగాణ-జిన్నారం

హెటిరో డ్రగ్స్ పరిశ్రమ సౌజన్యంతో మండలంలోని శివనగర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ బృందంవిద్యార్థులకు బుక్స్, బ్యాగ్స్, స్టేషనరీ వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ.. పరిశ్రమలు సామాజిక కార్యక్రమాలపై ముందుకు రావాలన్నారు. ఈ సంవత్సరం ప్రతి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఇంటర్నెట్‌తో సాంకేతికపరమైన టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అలాగే పాఠశాల నిర్వహణ మెయింటెనెన్స్ సౌకర్యాల కల్పనకై కొరకు సోలక్ పల్లి మాజీ సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి ఏడాదికి రూ.20వేల చొప్పున ఐదేండ్లు అందిస్తానని ప్రకటించడంతో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, స్థానిక మాజీ ఎంపిటిసి భత్తుల సంతోష మహేష్, నర్సింలు మహేష్‌గౌడ్ రాజు గౌడ్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటలేదన్నారు. కాబట్టి ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని కోరారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయి. రాష్ట్రంలో అక్షరాస్యత 66శాతం దాటడంలేదన్నారు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబడుతున్నారన్నారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సరిపోవు అన్నారు. కాబట్టి విద్యా వైద్య రంగానికి నిధులు పెంచాలన్నారు. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కొరకు పెద్ద ఎత్తున ఆందోళన సాగుతున్నదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రు.5లక్షలు, దళితులకు రు.6లక్షలు ఇస్తామని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారన్నారు. దానికి రూ.8424 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వాస్తవా నికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రు.10లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలండర్‌ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రు.1లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీలేకుండా రు.2లక్షలకు పెంచాలన్నారు. నారాయణఖేడ్ ప్రాంత సమగ్ర అభివృద్ధి నిధులు కేటాయించాలన్నారు. వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతీ యువకులకు ఉద్యోగం అవకాశాలు కల్పించా లన్నారు. వలసలను నివారించాలి, వ్యవసాయానికి సాగునీరు కోసం ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయాలన్నారు. మినీ యూనివర్సిటీ మంజూరు చేయాలని.. ప్రభుత్వ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలన్నారు. సిటీ స్కాన్ ఎంఆర్ఐ వంటి అన్ని పరీక్షలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని.. వీటన్నిటికీ రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ సవరణ చేసి.. నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్‌లో సర్వేలు





నవతెలంగాణ-సంగారెడ్డి, నారాయణఖేడ్‌రూరల్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్‌లో గురువారం సర్వేలు చేపట్టారు. సంగారెడ్డిలోని డిపార్ట్మెంట్ అటాచ్డ్ హాస్టల్(బాబానగర్)లో, నారాయణఖేడ్ పట్టణంలోని హాస్టల్స్‌లో సర్వే చేశారు.

ఈ సందర్భంగా సంగారెడ్డిలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ మాట్లాడుతూ.. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని.. కాబట్టి విద్యారంగానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వానికి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఈ హాస్టల్‌ను అనేక ఏండ్ల కిందట నిర్మించారని.. కాబట్టి వెంటనే కొత్త భవనాన్ని నిర్మించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ డబ్బులు పెంచాలన్నారు. విద్యార్థులకు ప్రతినెలా ప్యాకెట్ మనీ వేయి రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, జిల్లా సహాయ కార్య దర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ.. గతవారం రోజుల నుంచి వర్షాలు పడడంతో నారాయ ణఖేడ్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో వర్షపు నీరు స్లాబ్ నుంచి విద్యార్థుల గదుల్లో పడుతున్నదన్నారు. మరోపక్క బీసీ కళాశాల హాస్టల్ కూడా అద్దెభవనంలో కొనసాగడంతో విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాల హాస్టల్స్‌లకు సొంత భవనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కాస్మోటిక్ చార్జీలను రూ.300కి పెంచి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మెస్ చార్జీలు వంద రూపాయలకు పెంచాలన్నారు. హాస్టల్ సమస్యలు పరిష్కారం చేయకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



నవ తెలంగాణ- వెల్దుర్తి

పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు విద్యార్థి దశ నుండి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాసాయిపేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మపురి అన్నారు. గురువారం మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్ బాల్ క్రీడలను విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా సాఫ్ట్ బాల్ మైదానాన్ని ప్రారంభించారు. క్రీడాకారులకు భవిష్యత్తులో విద్యా ఉద్యోగ అవకాశాల్లో ఈ క్రీడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొని జిల్లా రాష్ట్ర జాతీయస్థాయిలో విద్యార్థులు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రంగారెడ్డి, రాజేశ్వరరావు, భాగ్యలక్ష్మి హరిరంజన్ శర్మ, ఫిజికల్ డైరెక్టర్ శ్యాంసుందర్ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్ గురై పాడి గేదె మృత్యువాత



- సుమారు 50 వేల రూపాయల నష్టం

నవతెలంగాణ -వెల్దుర్తి

విద్యుత్ షాక్ గురై పాడి గేదె మృత్యువాతకు గురైన సంఘటన గురువారం మండల పరిధి మానేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన గారే బోయిన శ్రీశైలం బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం రోజువారి లాగే మేతకు కొట్టుకుపోయి మేపుతున్న క్రమంలో మానేపల్లి గ్రామ శివారులో రెడ్డిగూడెం వెళ్లే రహదారి పక్కన సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కిందికి ఉండడంతో అటువైపు వెళ్లిన గేదెకు ట్రాన్స్ఫార్మర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడిందని తెలిపారు. దాని విలువ సుమారు 50 వేలు ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పాడి గేదె మృత్యువాతకు గురైందని తెలిపారు. రోజు పాలు పిండి అమ్ముకొని జీవనోపాధి కొనసాగించేవారిమన్నారు. పాడి గేదె మృత్యువాతకు గురి కావడంతో కుటుంబ పోషణకు కుంటూ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని శ్రీశైలం డిమాండ్ చేశారు.

పల్లెలపై మద్యం పడగ



- విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు
- మద్యం వ్యసనానికి బానిసవుతున్న యువత
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు..?



నవతెలంగాణ-రామాయంపేట

దేశ భవిష్యత్తుకు ఆధారం యువత. అలాంటి యువత మద్యానికి బానిసవుతుంది. డబ్బు సంపాదనే పరమావధిగా మద్యం వ్యాపారులు పల్లె పల్లెకు బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి, యువతను మద్యం వ్యసనానికి బానిసలు చేస్తున్నారు. మద్యం దుకాణందారుల ధన దాహంతో, పల్లెల్లో మద్యం పడగలు విప్పింది. బెల్ట్ దుకాణాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులే, మద్యం వ్యాపారులను ప్రోత్సహిస్తున్నట్లుగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రతి పల్లెలో రెండు నుంచి మూడు బెల్ట్ దుకాణాలు యదేచ్ఛగా కొనసాగడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతుంది.

వైన్స్‌లను మించి బెల్ట్ దుకాణాల్లో విక్రయాలు

రామాయంపేట మండల పరిధిలో 14 గ్రామపంచాయతీలు ఉండగా, సుమారుగా అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో అయితే అనుమతి ఉన్న వైన్స్ దుకాణాల్లో కన్నా అధికంగా మద్యం అమ్మకాలు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. వీటన్నింటికి రామయంపేట పట్టణంలో ఉన్న మూడు వైన్స్ ల నుండి మద్యం సరఫరా జరుగుతుంది.

బెల్ట్ షాపులకు వైన్స్‌ల నుంచి విచ్చలవిడి విక్రయాలు

నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి 12 బీర్లు లేదా ఆరు మద్యం బాటిళ్ళు మాత్రమే విక్రయించాలి. మద్యం బాటిళ్ళు ఫుల్ బాటిల్ అయినా ఆఫ్ అయినా క్వాటర్ అయినా ఆరు బాటిల్‌లు మాత్రమే ఒక వ్యక్తికి విక్రయించాలి. నిబంధనలు తుంగలో తొక్కిన రామాయంపేట మండల కేంద్రంలోని మద్యం దుకాణ వ్యాపారులు నిత్యం బెల్ట్ దుకాణాలకు చెందిన ఒక్కొక్క వ్యక్తికి కాటన్‌ల కొద్ది మద్యం, బీర్లు లక్షల రూపాయల మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీంతో పల్లెల్లోకి ఇంటిముందుకే మద్యం వచ్చి చేరుతుంది. ఇంటి వద్దకే మద్యం రావడంతో యువతతో పాటు కూలినాలి చేసుకునే నిరుపేదలు, రైతులు మద్యానికి బానిసలు అవుతున్నారు.

మద్యానికి బానిసై అప్పులపాలు

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహించడతో మద్యానికి బానిసైన కుటుంబాలు అప్పుల పాలై రోడ్డున పడుతున్నాయి. చేసిన కష్టమంతా తాగుడికే ధారపోస్తున్నారు. ముఖ్యంగా యువత మద్యానికి ఆకర్షితులవుతున్నారు. గ్రామాల్లో ఎక్కువగా ప్రజల మధ్య అల్లరులు, గొడవలు జరగడానికి మద్యం కారణమవుతోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వైన్స్ దుకాణలతో పాటు, బెల్ట్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐని వివరణ కోసం ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

జనరంజకమైన ప్రజా బడ్జెట్



నవతెలంగాణ-తూప్రాన్

జనరంజకమైన ప్రజా బడ్జెట్ మెదక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024-25 జన రంజకమైన ప్రజా బడ్జెట్ అని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ కొనియాడారు. బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమ ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తీరు అభినందనీయమన్నారు. వ్యవసాయం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 6 గ్యారంటీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత నివ్వడం శుభసూచకమన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించడం హర్షనీయమన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్‌గా రూ.500 చెల్లించడం మంచి నిర్ణయమన్నారు.

విద్యార్థినికి ల్యాప్టాప్ అందించిన కేటీఆర్



నవతెలంగాణ-తూప్రాన్

గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా తూప్రాన్ విద్యార్థినికి లాప్టాప్ కేటీఆర్ అందించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ విద్యార్థినికి ల్యాప్టాప్ ను బుధవారం అందించారు. లాప్టాప్ అందుకున్న మమతను కేటీఆర్ ఆశీర్వదించి, ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పాటిమీది జగన్మోహన్ రావు, నాని తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



- ఎంపీడీవో రాజిరెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతిని గురువారం ఎంపీడీఓ రాజిరెడ్డి, స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఆయన ఇంటింటికి తిరుగుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గోరువెచ్చని నీటి త్రాగాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి ప్రేమ, ఎంఎల్ హెచ్ పి స్వాతి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదల వల్ల ప్రాణ నష్టం జరగకుండా చూడాలి



- మెదక్ ఆర్‌డీఓ

నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల ప్రాంతంలో వరదల వల్ల ఎలాంటి ప్రాణం నష్టం జరగకూడదని మెదక్ ఆర్డిఓ రమాదేవి గురువారం అన్నారు. ఏడుపాయలలో గల వనదుర్గ ప్రాజెక్టును సందర్శించారు. తరచుగా మరణాలు సంభవించే ప్రదేశాలను గురించి అడిగి తెలుసుకుని ప్రదేశాలను పరిశీలించారు. అట్టి ప్రదశాలలో రక్షణ ఏర్పాట్లు చేయుటకు అంచనా ప్రతిపాదనలు పంపాలని సంబధిత నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భారీ వర్షాల దృష్ట్యా వరద ఉధృతి వచ్చే అవకాశమున్నందున ఎలాంటి ప్రాణం నష్టం జరగకుండా ప్రమాదాలు జరగకుండా, ప్రజలను ప్రాజెక్టు వద్దకు రాకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. తహాశీల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

27న పీడీపీఈటీల సమావేశం



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్స్, పి.ఇ.టి.లకు సమావేశం నిర్వహించనున్నట్లు పాఠశాల క్రీడల కార్య నిర్వాహక కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ సమావేశం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలో క్రీడల నిర్వహణతో పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడల ఎంపికపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలో గల పి.డిలు, పి.ఇ.టి. లు అందరూ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నూతన డిఎల్పిఓగా యాదయ్య



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ డిఎల్పిఓ గా బి.యాదయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. నర్సాపూర్ డిఎల్పిఓ గా పనిచేసిన బి.యాదయ్య తూప్రాన్ కి బదిలీపై వచ్చారు. ఇంతకుముందు తూప్రాన్ డిఎల్పిఓగా పనిచేసిన శ్రీనివాసరావు రిటైర్ అయ్యారు. నూతన డిఎల్పిఓగా బాధ్యతలు చేపట్టిన బి.యాదయ్యను ఆఫీస్ సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

నూతన ఎంపీడీవోగా శేషాద్రి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ నూతన ఎంపీడీవోగా కె.శేషాద్రి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో ఎంపీడీవో గా విధులు నిర్వహించిన శేషాద్రి మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. మెదక్ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో శేషాద్రిని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో తూప్రాన్ ఎంపీడీవోగా నియమించారు. ఇంతకు ముందు ఇన్చార్జి ఎంపీడీవోగా ఉన్న వెంకటేశ్వర్ రెడ్డి నూతనంగా వచ్చిన ఎంపీడీవో శేషాద్రికి బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో శేషాద్రిని సీనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



నవతెలంగాణ-చేగుంట: చేగుంట మండలం కరీంనగర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీలపై వేరే పాఠశాలలకు వెళుతున్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలతో పాటు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సాలోమి, మానస, మమత ,వీరు బదిలీపై వెళ్లారు. అలాగే కొత్తగా జాయినింగ్ అయిన ఉపాధ్యాయులు జగన్ లాల్, విజయేందర్ రెడ్డి, కృష్ణమూర్తి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

తూప్రాన్ నూతన ఎంపీవోగా సతీష్



నవతెలంగాణ-తూప్రాన్: తూప్రాన్ మండల నూతన ఎంపీఓగా సతీష్ గురువారం బాధ్యతలు చేపట్టారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మనోహరాబాద్ మండలం నుంచి తూప్రాన్‌కి బదిలీపై వచ్చారు. ఇంతకుము ందు తూప్రాన్ ఎంపీవోగా పనిచేసిన క్రిష్ణవేణి కొల్చారం మండలానికి బదిలీపై వెళ్లారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ సర్పంచ్



నవతెలంగాణ-చేగుంట: మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బాయికాడి కుమార్ కొద్ది రోజుల క్రితం యాక్సిడెంట్ అయ్యి చికిత్స పొందాడు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రోత్సులంతో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బాయికాడి కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఇబ్రహీంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దోరగొల్ల రాములు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాములు, నీల స్వామి, మల్లేశం, బెదరమైన కిరణ్, గొల్ల మల్లేశం, గుర్రాల సురేష్, పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తవద్దు

- గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలి
- అంటూ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి
- గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలి
- అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండాలని,గ్రామాలలో పరిశుభ్రత అంటూ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తత ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వర్షాకాలం లో ప్రజల ఆరోగ్య విషయంలో చైతన్యవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనారోగ్యనికి గురైన ప్రజలకు సరైన వైద్య పరీక్షలు నిర్వహించి ,సరైన మందులు పంపిణీ చేయాలన్నారు.గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలనీ,గురుకుల విద్యాలయాల్లోనీ విద్యార్థులందరికీ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలాన్నారు.అంగన్వాడీలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు గర్భిణులకు పౌష్టికరమైన ఆహారం అందించానీ, అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జెడ్పి సీఈవో ఎల్లయ్య,జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ జిల్లా అధికారులు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సొమ్మును పంట పెట్టుబడికి వినియోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



నవతెలంగాణ-నర్సాపూర్

ప్రభుత్వం ఎంతో వ్యయప్రయసాల కోర్చి అన్నదాతలు బ్యాంకుల నుండి తీసుకున్న పంట రుణలాన్నిటిని మాఫీ చేయడం జరిగినదని, మాఫీ అయిన రుణమాఫీ డబ్బులను పంట పెట్టుబడి కోసం వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయధికారి గోవింద్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోమారం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించిన ఆయన ఏపీజీవిబి బ్యాంకును సందర్శించారు. ఈసందర్భంగా డిఏఓ గోవింద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన 2 లక్షల రుణమాఫీ పథకంలో తొలి విడతగా గోమారం బ్యాంకులో 820 మంది రైతులకు రూ.4.49 కోట్ల రుణమాఫీ అయిన విషయాన్నీ బ్యాంకు మేనేజర్ ను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో ఉన్న రైతులతో రుణమాఫీ డబ్బుల గురించి చర్చించారు. రుణమాఫీ డబ్బులు వృధాగా ఖర్చు చేయకుండా పంట పెట్టుబడికి ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగినది. రుణమాఫీ విషయంలో ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లావణ్య, ఏఈఓలు మౌనిక, మాజీద్ అలీ, భవాని, రవి, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-పాపన్నపేట

మీసేవ కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. మీసేవకేంద్రం పనితీరును అక్కడ ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, ఈఎస్‌డీ నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పేమెంట్ విధానాన్ని పరిశీలించి ప్రజలందరూ క్యాష్‌లెస్ డిజిటల్ పేమెంట్ చేయాలని సూచించారు. దీనివలన ప్రజలు ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. మీసేవ నిర్వాహకులు ఈఎస్‌డీ ఆదేశాల మేరకు రెవెన్యూ సర్వీసులకు సంబంధించి సరియైన పత్రాలు మాత్రమే జతపరచాలని, లేదంటే నూతనంగా ప్రవేశపెట్టిన ఓసిఆర్ (ఒప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్) విధానం ద్వారా తిరిగి మీ లాగిన్‌లోకి వస్తాయని తెలిపారు. ఇకముందు తాను సంబంధిత అధికారులు ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలు చేస్తామని, జిల్లాలో ఉన్న అన్ని మీసేవ సెంటర్లు ఈఎస్‌డీ గైడ్లెన్స్ ప్రకారం నడుచుకుంటూ ప్రజల దగ్గర మీసేవ ప్రత్యేకంగా ధరణి సర్వీసులకు ఎలాంటి అదనపు రుసుము తీసుకోకుండా నడపాలని హెచ్చరించారు. లేకపోతే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సందీప్, టేక్మల్ మండల ఎమ్మార్వో, టీజీటీఎస్ఎస్ మీసేవ జిల్లా మేనేజర్ శశికాంత్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ హౌస్ వైరింగ్‌లో నెలరోజుల పాటు ఉచిత శిక్షణ

- మనోహరాబాద్ ఏపీఎం పెంట గౌడ్



నవతెలంగాణ-మనోహరాబాద్

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ,సంగారెడ్డి లో వచ్చేనెల 5 నుండి నెలరోజుల పాటు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ లో శిక్షణ ఇవ్వనున్నట్టు మనోహరాబాద్ ఏపీఎం పెంట గౌడ్ పేర్కొన్నారు. ఈ శిక్షణకు మెదక్,సంగారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ పురుషులకు నెలరోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీ వంగా రాజేంద్ర ప్రసాద్ తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు .ఈ అవకాశాన్ని గ్రామీణ నిరుద్యోగ యువకులు వినియోగించుకోవాలని,శిక్షణలో వసతి, భోజనం, కోర్సు మెటీరియల్ పూర్తి ఉచితంగా ఉంటుందని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్ తో పాటుగా ,టూల్ కిట్ ఇస్తామని తెలిపారు (సంస్థ చిరునామా: బైపాస్ రోడ్, సంగారెడ్డి, వెలుగు ఆఫీస్ పక్కన,బసవేశ్వర రైస్ ట్రేడర్స్ షాప్ ప్రక్కన ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కోసం వచ్చే నిరుద్యోగ యువకులు రేషన్ కార్డ్ ,ఆధార్ కార్డ్ ,చదువుకున్న స్టడీ సర్టిఫికెట్స్ ,బ్యాంక్ వివరాలు,5 ఫోటోలతో హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు: 9490103390,9490129839 నంబర్లను సంప్రదించాలని ఏపిఎం పెంటా గౌడ్ పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో మున్సిపల్‌ను కైవలం చేసుకుంటాం



నవతెలంగాణ-తూప్రాన్

రాబోయే స్థానిక ఎన్నికల్లో తూప్రాన్ మున్సిపాలిటీని కైవసం చేసుకుని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుకి కానుకగా ఇస్తామని పార్టీ సీనియర్ నాయకులు పార్లమెంట్ కన్వీనర్ వర్గంటి రామ్మోహన్ గౌడ్, దుబ్బాక అసెంబ్లీ కో కన్వీనర్ చిలుకమర్రి గోవింద్‌లు స్పష్టం చేశారు. తూప్రాన్ మున్సిపాలిటీ బీజేపీ మండల కార్యవర్గ సమావేశం గురువారం బీజేపీ మున్సిపల్ పార్టీ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. తూప్రాన్ మున్సిపాలిటీని, మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోవడానికి కావలసిన కనీస అవసరాలు తీరుస్తూ, డిగ్రీ కళాశాల, అత్యాధునిక పరికరాలతో ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తూ, తూప్రాన్‌ను పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం వారిని పార్టీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మహేష్ గౌడ్, పోతరాజు నాగరాజ్, శరత్, వెంకట్, మధు, వినయ్, సంపత్, వంశీ, సాయి, రాకేష్, నవీన్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు ఎస్ఎఫ్ఐ పిలుపు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్ అజయ్



నవతెలంగాణ-మెదక్ టౌన్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్ , అజయ్‌లు పేర్కొన్నారు. విద్యారంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3% ఇది గత ఓటాన్ బడ్జెట్ లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ అని అన్నారు. గత బడ్జెట్ లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించిందని, అది ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఏ మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ఐ భావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినా దాని ఊసు ఈ బడ్జెట్లో లేదని వాపోయారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు. దాని గురించి చర్చే లేదన్నారు. యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుందన్నారు. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారన్నారు. యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్శిటీలు నోచుకోవన్నారు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని డిమాండ్ చేశారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా బడ్జెట్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 2024-25 ఆర్థిక ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడే విధంగా ఉందన్నారు. రాష్ట్ర ఆదాయ వనరులకు, అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను సమకూర్చుతో ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా ఈ బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అత్యధిక నిధులు కేటాయించారు. రెండు లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు ప్రవేశపెట్టిందన్నారు. ఈ బడ్జెట్లో విద్య, వైద్యం రంగాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి నీటిపారుదల రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు భరోసా కల్పిస్తూ ఆయా పథకాలకు, గ్రామాలలో భూమిలేని రైతులకు రోజువారి కూలీలకు ఏడాదికి 12, వేలు ఆర్థిక సాయం అందించేందుకు ఈ బడ్జెట్లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

డబుల్ బెడ్ రూం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

- ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్ డబుల్ బెడ్ రూం కాలనిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతానని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం ఆటోమెటిక్ క్లోరినేషన్ ఆన్ లైన్ మానటరింగ్, మున్సిపల్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన సురక్షితమైన త్రాగునీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం నందు త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడ్తామని హామినిచ్చారు. డబుల్ బెడ్ రూంలలో నివసించే వారి సమస్యలను త్వరలోనే తీరుస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్న అకామ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్‌లు ఆవారి శేఖర్, దాయర లింగం, మేడి మధుసూదన్, లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, జీవన్ రావ్, మందుగుల గంగాధర్, పరుశురాం, బాని, సంతోష్, రాగి అశోక్, గోదల సాయి, నరేష్, సమీ, ఎస్.డి. క్రిష్ణ, లక్ష్మణ్, నాగరాజు, అమీర్, మన్నె సుదర్శన్, దుర్గప్రసాద్, పోచేందర్, సంగమేశ్వర్, అశోక్, ఆన్ మోల్ సంస్థ ప్రతినిధులతో పాటు మున్సిపల్ కమీషనర్ జానకి రాం సాగర్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక దిగుబడి

- మండల హార్టికల్చర్ అధికారి ఉదయ్ కిరణ



నవతెలంగాణ-నార్సింగి

ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభం పొందవచ్చని మండల హార్టికల్చర్ అధికారి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్పు పరికరాలు సరఫరా చేస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వం 10 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. డ్రిప్ పరంగా ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు తొంబై, ఓసీలకు ఎనబై శాతం రాయితీతో అందిస్తుందని తెలిపారు. ఎకరాకు 57 మొక్కలు నాటాలని, పంట వేసుకున్న నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి ప్రారంభం అవుతుందన్నారు. ఒక సారి వేసిన పంట 30 నుంచి 40 సం.వరకు, ఎకరాకు 15 నుంచి 17 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని, ఏడాదికి లక్షా యాభై వేల వరకు ఆదాయం కలుగుతుందని వివరించారు. నాలుగు సంవత్సరాల వరకు ఆయిల్ పామ్‌లో ఇతర పంటలు అంతర పంటగా వేసుకోవచ్చని, వాటికి కూడా ప్రభుత్వం ఏడాదికి రూ.4,200 అందిస్తుందని వివరించా రు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్ పామ్ తోటల సాగు చేసి ఆర్థికంగా లాభాలు సమకూర్చుకోవాలని సూచించారు.

తూప్రాన్ మున్సిపాలిటీలో వీధి కుక్కల పట్టివేత



నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలో వీధి కుక్కల పట్టివేత

తూప్రాన్ మున్సిపాలిటీలో పలు వార్డులలో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టారు. మున్సిపాలిటీలోని వీధులలో తిరుగుతున్న కుక్కలను ఎంఎయు తో పాటు బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ వారు తూప్రాన్ మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి,తూప్రాన్ పట్టణంలో అనవసరంగా వీధులలో తిరుగుతూ చిన్న పిల్లలను పెద్దలను గాయపరుస్తున్న కుక్కలను పట్టుకోవడం జరిగింది. సోషల్ మీడియాలో చిన్నపిల్లలను కరుస్తున్న కుక్కల వీడియోలు వైరల్ గా మారడంతో తూప్రాన్ మున్సిపాలిటీ అధికారులు తూప్రాన్ లో ఉన్న కుక్కలను పట్టడానికి చర్యలు చేపట్టారు.దీంతో తూప్రాన్ పట్టణ వాసులకు కాస్త ఉపశమనం లభిస్తుందని,కుక్కల బెడద తప్పుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ,మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినుద్దీన్,బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మాఫీ డబ్బులు వారి ఖాతాలో జమ చేయాలి

- లీడ్ బ్యాంకు మేనేజర్ (ఎల్డిఎం) హరి బాబు



నవతెలంగాణ-తొగుట

రుణ మాఫీ పొందిన రైతులకు త్వరిత గతిన రుణ మాఫీ డబ్బులు వారి ఖాతాలలో జమ చేయాలని, ఎపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌ను లీడ్ బ్యాంకు మేనేజర్ (ఎల్డిఎం) హరి బాబు ఆదేశించారు. గురువారం జిల్లా వ్యవసాయ అధికారి మహేష్‌తో కలిసి తొగుట గ్రామీణ వికాస్ బ్యాంకును సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రుణ మాఫీ పొందిన రైతులకు త్వరిత గతిన రుణ మాఫీ డబ్బులు వారి ఖాతాలలో జమ చేయాలని బ్యాంకు మేనేజర్‌కు సూచించారు. రుణ మాఫీ పొందిన రైతులు వారికి తగిన డాకుమెంట్స్ (పత్రాలు ఆధా ర్ కార్డ్, పట్టా పాస్ బుక్, బ్యాంకు ఖాతా పాస్ బుక్, భూమి సంబంధించిన 1 బి జిరాక్స్‌లు) బ్యాంకు అధికారులకు అందజేయాలని తెలిపారు. అనంతరం రుణమాఫీ డబ్బులు పొందాలన్నారు. ఈ సందర్భనలో వ్యవసాయ అధికారి మోహన్, బ్యాంకు మేనేజర్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి



నవతెలంగాణ-నంగునూరు

మన చుట్టూ ఉండే పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని గ్రామ ప్రత్యేక అధికారి వై.పద్మ కోరారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి వి.చంద్రకళ అధ్యక్షతన పారిశుధ్య కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, త్రాగునీరు, ఫ్రైడే, డ్రైడే, వన మహోత్సవం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ సీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రాజెక్టులకు నిధులేవి

- గజ్వేల్‌పై సీఎం వివక్షత
- 420 హామీలకు బడ్జెట్ సరిపోతుందా?
- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న రెండు ప్రాజెక్టులకు నయా పైస సీఎం రేవంత్ రెడ్డి కేటాయించలేదని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి విమర్శించారు. గురువారం తెలంగాణ బడ్జెట్ ప్రకటనపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు వద్ద టూరిజం అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రతిపాదించినప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మల్లన్న సాగర్ వద్ద టూరిజం స్పాట్‌కు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా కొండపోచమ్మ వద్ద కూడా టూరిజం స్పార్టు చేయాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదన చేసిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వీటిని పక్కకు పెట్టిందన్నారు. నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంపై కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి వివక్షత చూపుతున్నారని విమర్శించారు. డిసెంబర్ 9న అధికారం చేపట్టిన కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి 6 గ్యారంటీల పేరిట 420 హామీలు ఇచ్చారని దీనికి బడ్జెట్ సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే పెన్షన్ పెంచలేదు, రైతుకు భరోసా, బంధు లేదు, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్‌తో పాటు తులం బంగారం ముచ్చట జాడ లేదన్నారు. అంకెల గారడి బడ్జెట్‌గా మారిందని విమర్శించారు.మల్లన్న సాగర్ నిర్వాసితులకు కోట్ల రూపాయల వరకు ఇంకా ప్యాకేజీ రావాల్సి ఉండగా బడ్జెట్లో పెట్టలేకపోయారన్నారు. ఓట్ల కోసం వచ్చి గజ్వేల్‌లో మల్లన్న సాగర్ నిర్వాసితుల వద్ద మొసలి కన్నీరు కార్చిన రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ నిర్వాసితులను మరవడమేమిటన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు పెద్దపీట వేసినట్లు ఆయన గుర్తు చేశారు.

ప్రజల సంక్షేమ బడ్జెట్



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పేదలను ఆదుకునే విధంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులే నిదర్శనమని మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు కలిముద్దీన్ అన్నారు. గురువారం ఆయన సిద్దిపేటలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని, అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు ప్రజలకు అందించడానికి సరిపడా నిధులు కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అన్ని రంగాలను కూడా అభివృద్ధి చెందించే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా ఆమోదం పొందిన భట్టి బడ్జెట్

- మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఉపముఖ్య మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆమోదం పొందిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మైనార్టీ సెల్ నాయకులు అజ్గర్ అన్నారు. గురువారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల కోసం పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్, 200 వందల విద్యుత్ ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. పేదల సంక్షేమం కోసం నిధులు శాఖల వారీగా కేటాయించినట్లు వారు తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు బడ్జెట్లో సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేసినట్లు వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలను విస్మరించారని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు బీసీలకు బడ్జెట్లో పెద్దపీట వేసిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు పత్రికలో ఉండాలని మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, వెంకట గౌడ్, దప్పు గణేష్, యాదగిరి, శ్రావణ్ కుమార్, అజీమ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితులకు వొట్టి చేయి చూపించారు

- బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు గీసు మల్లేశం



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమర్క బడ్జెట్‌లో దళితులకు వొట్టి చేయి చూపించారని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు గీసు మల్లేశం ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. దళితబంధు పథకం ప్రస్తావనే లేదని, దళితులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ లేదని తేలిపోయిందన్నారు. రైతులను పూర్తిగా విస్తరించిందన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాజుకు ఘన సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజుకు ఇటీవల భక్తిరత్న జాతీయ గౌరవ పురస్కారం వచ్చిన సందర్భంగా గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు అన్నెబోయిన మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు అన్నె బోయిన మల్లేశం గౌడ్ మాట్లాడుతూ రామకోటి రామరాజు ప్రజలను భక్తిమార్గం వైపు మల్లె విధంగా కృషి చేస్తూ ప్రతి వ్యక్తిచే రామనామాన్ని లిఖింపజేపిస్తూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రల వ్యాప్తంగా మరో భక్త రామదాసుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రామకోటి రామరాజుకు భక్తిరత్న జాతీయ అవార్డు రావడం ఎంతో గర్వకారణం అన్నారు. 25సంవత్సరాల నిర్విరామ కృషి, పట్టుదల అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ నంగునూరి సత్యనారాయణ, లయన్ రావికంటి చంద్రశేఖర్, లయన్ దొంతుల సత్యనారాయణ, లయన్ గుడాల శేఖర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య భవన్ నూతన కమిటీకి సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్యవైశ్య భవన్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని స్థానిక వైశ్య భవన్లో వాసవి క్లబ్, స్టార్ యూత్ క్లబ్ సిద్దిపేట సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతన పిఎస్టీలు అయిత బాల రాజేశం, పోశెట్టి శ్రీకాంత్, గంప కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్‌గా చింత రాజేంద్రప్రసాద్, కొత్తూరి అశోక్, జాయింట్ సెక్రెటరీలుగా జూలూరి శ్రీనివాస్, చకిలం రవిలను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీజన్ చైర్మన్ మంకాల శ్రీనివాస్, డిస్టిక్ సపోర్టింగ్ ఆఫీసర్ పుల్లూరి శశాంక్, వాసవి క్లబ్ అధ్యక్షులు రవి, స్టార్ యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, సెక్రటరీలు తోట విశ్వం, బుక్క శివ సంతోష్, ట్రెజరర్ నాగేందర్, వెంకటేశం, దుర్గయ్య, వేణుగోపాల్, శ్రీధర్, శ్రవణ్ కుమార్, సతీష్, మహేష్, సాయి, వెంకట్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తానికి మెండిచేయి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

2024-25గాను రూ.2,91,159 కోట్ల తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల ఆశలపై నీళ్లు చల్లిందని డిబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులను పొగిడినట్టె పొగిడి నొటితో మాట్లాడి నొసలితో వెక్కిరించినట్టుందన్నారు. చెవెళ్ళ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను చెత్తబుట్టలో పడేసిందన్నారు. గత ప్రభుత్వం దళిత బందు పేరా రూ.17,700 కోట్లు కేటాయిస్తే, ఈ ప్రభుత్వం అంబేడ్కర్ అభయ హస్తంగా మార్చి రూ.12 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో దీని ఊసే లేకపోవడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ ప్రత్యేక నిధి కింద రూ.36,750 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో నిధులు తగ్గించి రూ.33,124 కోట్లు కేటాయించడం దళితుల పట్ల సవతితల్లి ప్రేమకు నిదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకులు, పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

- హుషారుగా రైతులు. జోరుగా వరి నాట్లు

నవతెలంగాణ-గజ్వేల్

వారం రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలు రైతులను ఉత్తేజపరుస్తున్నాయి. దీంతో రైతులు పత్తి, మొక్కజొన్న, మళ్లీ విత్తనాలు విత్తుతూ వరి నాట్లు జోరుగా వేస్తున్నారు. ఎడతెరిపి కురుస్తున్న తుఫాన్ మోస్తారు వర్షాలకు రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. సిద్దిపేట జిల్లాలో పలు గ్రామాల్లో మండలాల్లో పంటల సాగు ఊపందుకుంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా వారం రోజులపాటు వర్షం కురిసిన దాఖలాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఊపిరి పీల్చుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. జిల్లాలో గత వారం రోజులుగా ముసురులు అలుముకున్నాయి.

పెరిగనున్న పంట సాగు

పత్తి పంట సాగు ఇప్పటి వరకు లక్ష ఎకరాలు దాటిందని చెప్పాలి. మొన్నటివరకు 90 వేల ఎకరాలే ఉండగా కురుస్తున్న వర్షానికి మళ్లీ పత్తి నాటుతున్నారు. దీంతో 1.25 లక్షల ఎకరాల వరకు ఉందని అధికారులు భావిస్తున్నారు. మొక్కజొన్న ప్రస్తుతం 20 వేల వరకు ఉండగా మరో 20 ఎకరాలు పెరగవచ్చు అని అధికారులు భావిస్తున్నారు. వరి సాగు15 వేల ఎకరాలు ఉండగా మరో 20 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. ఎడతెరిపి కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

ఇంటికే పరిమితమైన చిరు వ్యాపారులు

గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, కొండపాక, తొగుట, చిన్నకోడూర్, చేర్యాల తదితర మండలాల్లో 5 నుంచి ఏడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఎడతెరిపి కురుస్తున్న వర్షంతో చాలా చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. గజ్వేల్ నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న శాంతించకపోవడంతో చిరు వ్యాపారులు ఇంటికే పరిమితమయ్యారు. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల తదితర పట్టణాల్లో రోజుకు రూ 25 వేల వరకు లావాదేవీలు జరుగుతాయి కాని సగం కూడా దాటడం లేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల కారణంగా కూరగాయలు అమ్ముడుపోవడం లేదని కుళ్ళిపోయే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. అంతే కాకుండా సిద్దిపేట జిల్లాలో 15 వేల మంది అడ్డ కూలీలకు వర్షాలు కురుస్తున్నడంతో పనులు దొరకడం లేదు. భవన నిర్మాణంలో భాగంగా లోపలి పనులు చేస్తున్నారు.

వలస కూలీలతో వరినాట్లు

అంతేకాకుండా వరి నాట్లకు ఛత్తీస్గడ్, ఇతర ప్రాంతాల నుండి పురుషులు వచ్చి నాట్లు వేస్తున్నారు. గజ్వేల్ రిమ్మనగూడ, ధర్మ రెడ్డిపల్లి, గిరిపల్లి, గజ్వేల్, నియోజకవర్గంలో చాలా మండలాల్లో కూలీల కొరత ఏర్పడి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులతో వరి నాటు వేస్తున్నారు. వరి నాట్లు ఊపందుకున్నాయి. ఓ పక్క వర్షాలు కురుస్తుండగా మరోపక్క పొలం ట్రాక్టర్లతో దున్నుతున్నారు. అంతేకాకుండా మిడిదొడ్డి, అల్వాల, ధర్మారం, మల్లుపల్లి, లోతట్టు ప్రాంతాలు గత





వారం రోజులుగా భారీ వర్షాలతో జలమయంగా మారాయి. గూడవల్లి వాగులోకి వర్షం నీరు వచ్చి భారీగా చేరుతుంది. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి పురాతన ఇండ్ల పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

మహిళా శక్తి పథకంతో మహిళలకు ఆర్థిక అభివృద్ధి

- మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన ఎస్ హెచ్ జి సభ్యుల భాగస్వామ్యం ఉంటుందని, మహిళలు ఆర్థికంగా బలపడాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం తీసుకొచ్చిందని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ ప్రసన్న రాణి, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మెప్మా సిబ్బందితో మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, కుక్కల బెడద పైన ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల వ్యాపారస్తులకు ఆదాయం కోసం ఉపాధి కల్పించారు. ఇందిరా మహిళా శక్తి కుట్టు కేంద్రాల ద్వారా పాఠశాలల యూనిఫారంలను కుట్టడం కొరకు కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏడాది పొడవునా మహిళా సంఘాల సభ్యులు కుట్టు పనిలో నిమగ్నమై ఉండటంవల్ల ఆదాయం పొందవచ్చన్నారు. శ్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా రుణాన్ని పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కోర్టు నిబంధనలను పాటిస్తూ వీధి కుక్కలను ఎలా అదుపు చేయాలో సమావేశ నిర్వహించామని, మరో వారం రోజుల్లో చర్యలు ప్రారంభిస్తామని, ఆర్పీలు సైతం ప్రతి ఇంటికి వెళ్లి వీధి కుక్కలతో ఎలా ప్రవర్తించాలో అవగాహన కల్పించాలన్నారు. ఇంట్లో చిన్న పిల్లలను వీధుల్లోకి ఒంటరిగా వెళ్లనివ్వొద్దని, వీధి కుక్కలు గుంపులుగా ఉన్నా ఒంటరిగా ఉన్నా, కుక్క అనుమానాస్పదంగా కనిపించినా వాటి జోలికి వెళ్లకుండా దూరంగా వెళ్ళాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల వల్ల మలేరియా వ్యాపిస్తుందన్నారు. మన నివాసాలలో ఉండే నీటి హౌజ్‌లు, పూల కుండీలు, బహిరంగ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి వెళుతూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ హనుమంత్ రెడ్డి, టిఎంసి సాయి కృష్ణ, సిఓలు రమ్య, జ్యోతి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 4వ తేదీలోగా రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాలి

- గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్



నవతెలంగాణ-గజ్వేల్

రైతు బీమాను అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. గురువారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ కొత్తగా పాస్బుక్ వచ్చిన రైతులు, గత ఏడాది రైతు బీమా నమోదు చేసుకుని రైతులు రైతు బీమా కోసం 18 నుంచి 59 సంవత్సరాలు ఉండాలని ఆయన తెలిపారు. ఆగస్టు 4 లోపు వ్యవసాయ క్లస్టర్‌కు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు స్వయంగా వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు బీమాలో తప్పులు సవరణకు ఈ నెల 29 వరకు అవకాశం ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్నా రైతులు మరల దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదన్నారు. రైతు రుణమాఫీ రాని వారు వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఈఓలను, ఏఓలను కలిసి తగు సమాచారం తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సంబంధిత వ్యవసాయ పంటల సాగు నమోదును క్లస్టర్‌లోని ఏఈఓ వద్ద తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు చేసుకోకపోతే పంట కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

రుణ మాఫీపై బ్యాంకులను సందర్శించి ఏడీఏ



నవతెలంగాణ-నంగునూరు

రుణ మాఫీపై రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు గురువారం మండల కేంద్రంలోని బ్యాంకులను సిద్దిపేట సహాయ వ్యవసాయ సంచాలకులు వై.పద్మ సందర్శించారు. మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌లతో మాట్లాడారు. రైతుల వద్ద నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. రుణ మాఫీ జాబితాలో ఒక పేరు, ఆధార్ కార్డులో మరొక విధంగా ఉందని బ్యాంకు మేనేజర్‌లు చెప్పారని ఏడీఏ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయి వర్మ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీతో ప్రతి కుటుంబంలో సంతోషం



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం ప్రతి రైతు కుటుంబంలో సంతోషం నింపిందని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వివిధ పథకాలు అమలవుతున్నాయని, ఇందులో భాగంగా రైతు రుణమాఫీ పథకం అమలు చేయడం ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదన్నారు. ఆగస్టు లోపు రుణమాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారన్నారు. దీంతో గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన కేటీఆర్, హరీష్ రావులకు నిద్ర పట్టడం లేదన్నారు. 6 గ్యారంటీలు అమలు చేసి సీఎం రేవంత్ రెడ్డి ప్రజలతో శభాష్ అనిపించుకుంటారని పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమాలను అందే విధంగా చూస్తున్నారని, గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలపడుతుందన్నారు. పార్టీకి కష్టపడ్డ వారిని పార్టీ వదులుకోదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో రోడ్లు చేపట్టలేదు అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట మున్సిపాలిటీకి చెందిన 43వ వార్డు కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం యాదవ్, 14 వార్డుకు చెందిన కౌన్సిలర్ కవితను కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతరావును వారు కలిశారు. సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు కౌన్సిలర్లు సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరో ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరడంతో వారి సంఖ్య ఐదుకు పెరిగింది. మరి కొంతమంది కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్, ఎల్లంఎల్లం తదితరులు పాల్గొన్నారు.

హలో మాదిగ చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

- ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్



నవతెలంగాణ-సిద్దిపేట

ఆగస్టు 9న మాదిగల మహా ధర్నా విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం పాత బస్టాండ్ దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని, ఎస్సీలను ఏబిసిడిలుగా విభజిస్తామని చెప్పి దశాబ్ద కాలం అధికారంలో ఉన్నా వర్గీకరణ చేయలేదన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజల ఓట్ల మీద ఉన్న ప్రేమ వర్గీకరణపై చూపలేదని, ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగ, మాదిగ కులాల ప్రజలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాలలో పూర్తిగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. సుష్మ స్వరాజ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బండారు దత్తాత్రేయ, కిషన్ రెడ్డిలు ఎన్నోసార్లు వర్గీకరణ విషయంలో మాట్లాడినారని, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో జరిగిన మాదిగ దండోరా సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నారని మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు ఎంతో సంతోషపడ్డారన్నారు. 29 సంవత్సరాల వర్గీకరణ కోరిక నెరవేరుతున్నదని కోట్లాదిమంది మాదిగ, మాదిగ ఉపకులాలు ఆ సభలో వర్గీకరణ ప్రకటన చేస్తారని ఆశగా ఎదురు చూసినా ఆశ నెరవేరలేదన్నారు. వర్గీకరణ సాధన కోసం హలో మాదిగ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఉన్న మాదిగలు, మాదిగ ఉపకులాల వారు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిద్దిని రాజ మల్లయ్య మాదిగ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బొంబాయి వెంకన్న మాదిగ, జిల్లా అధ్యక్షులు లింగాల కృష్ణ మాదిగ, జిల్లానాయకులు సాయిలు మాదిగ, ప్రశాంత్ మాదిగ, స్వామి మాదిగ, నర్సింలు మాదిగ, జిల్లా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు బాలి గారి కృష్ణ మాదిగ, జిల్లా మాజీ టెలికం బోర్డ్ మెంబర్ వేముల సుధీర్ మాదిగ, సిద్దిపేట మున్సిపల్ అధ్యక్షులు డప్పు ఎల్లన్న మాదిగ, హౌసింగ్ బోర్డ్ ఇన్చార్జి ఎల్లన్న మాదిగ, తొగుట మండల అధ్యక్షుడు రాంపురం రమేష్ మాదిగ, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు ఏర్రోల నరసింహులు మాదిగ, నాయకులు దండు రాజు మాదిగ, జాంగిర్ మాదిగ, డానియల్ మాదిగ, రమేష్ మాదిగ, డేవిడ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

తుంగ చెరువులోకి నీళ్లు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

తుంగ చెరువులోకి నీళ్లు విడుదల చేయాలని నీటి పారుదల ఈఈ సాయిబాబాను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. కూడవెల్లి వాగులో నీరు ప్రవహిస్తున్న సందర్భంగా చందాపూర్ మొండి మత్తడి నుంచి ఫీడర్ చానల్ ద్వారా జప్తి లింగారెడ్డిపల్లి సమీపంలో ఉన్న తుంగ చెరువులోకి నీటిని విడుదల చేయాలన్నారు. రెండు రోజులుగా వాగు ప్రవహిస్తున్నా తుంగ చెరువులోకి నీటిని విడుదల చేయడం లేదని రైతులు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నీటిపారుదల ఈఈ సాయి బాబాతో ఫోన్‌లో మాట్లాడారు. చందాపూర్ మొండి మత్తడి నుంచి నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే నీటిని విడుదల చేస్తామని ఈఈ తెలిపారు. కాలువ పిచ్చి మొక్కలతో నిండి పోయిందని, తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

కేంద్ర మంత్రులు వెంటనే రాజీనామా చేయాలి

- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దేశ పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడంపై కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్ డిమాండ్ చేశారు. బలహీన ప్రధాని ఏపి, బీహార్ సీఎం లకు భయపడి అధిక నిధులు మంజూరు చేశారన్నారు. బిజెపి పక్షపాత వైఖరిని యువత, ప్రజలు ఖండించాలని కోరారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగు జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, తెలంగాణ రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టడంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తోపాటు మిగతా బిజెపి పార్లమెంటు సభ్యులు వెంటనే పూర్తిగా నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర నాయకుల, తెలంగాణ వ్యతిరేఖ వైఖరిని రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామిక వాదులు సిపిఐ అనుబంద సంఘాలు అర్థం చేసుకోని ముక్త కంఠంతో ఎక్కడికక్కడే ఖండించి తమ నిరసన తెలిపాలని కోరారు

రైతు రుణమాఫీపై స్పష్టత కరువు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

రైతు రుణమాఫీపై సవాలక్ష సందేహాలు, స్పష్టత కరువైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో ఎకరానికి రూ.15 వేలు ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఒకే సారి రుణమాఫీ అంటూ కేవలం లక్ష లోపు రుణాలపై సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. కేవలం ఇరవై, ముప్పై వేలు ఉన్న రైతులకు మాత్రమే మాఫీ చేస్తూ పాలాభిషేకాలు చేసుకోవడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్టు రెండు లక్షల రుణమాఫీని ఏ ఆంక్షలు లేకుండా వెంటనే రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో నంగునూరు మండలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు పండించిన సన్న ధాన్యానికి బోనస్‌గా రూ.500లు ఇస్తానని ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షులు పేరాల తిరుపతిరావు, సీనియర్ నాయకులు రజినీకాంత్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, వాసర యాద మల్లు, మండల ప్రధాన కార్యదర్శులు సురేందర్ రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తుంచుకోవాలి

- సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి
- హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్



నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించటానికి పడుతున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. గురువారం మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిదని, సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉందన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమని కష్టపడే తత్వంతో ఇష్టపడి చదువుకోవాలన్నారు. విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీ టీమ్ నిర్వహిస్తున్న విధులు, షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ మల్లేశం, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కేటాయింపులే కాదు ప్రజల సంక్షేమానికి ఖర్చు చేయాలి



- రాష్ట్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్.

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కాగితాల మీద లెక్కల వరకే పరిమితం కావద్దని ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసి అభివృద్ధికి దోహదం చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా మారకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా కేటాయింపులు చేసి ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర పథకాలకు నిధులు మళ్లించి ప్రజలపై భారాలు వేయవద్దన్నారు. ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసి పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు విద్యా వైద్యం రవాణా రంగాలకు ఖర్చు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి పట్టణాల్లో ఉపాయం పనులు నిర్వహించే విధంగా కేటాయింపులు చేయాలని అన్నారు.

ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



- డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రేవతి

నవతెలంగాణ-మిరుదొడ్డి

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రేవతి అన్నారు. గురువారం అక్బరు పేట భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో గ్రామస్థులకు వర్షాకాలంలో సంభవించే సీజనల్ డిసీజెస్ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వలన వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వైద్యులకు సిబ్బందికి పలు సూచనలు ఇవ్వడంతో పాటు వర్షాకాలంలో సంభవించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజలందరూ ప్రభుత్వ వైద్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ శ్రీకల,ఎపిడెమియాలజిస్ట్ రాథోడ్ సోఫాన్,భూంపల్లి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ మెడికల్ సిబ్బంది ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి



- డీడబ్ల్యుఓ శారద

నవతెలంగాణ-దుబ్బాక

సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు,వివక్ష పట్ల మహిళలు చైతన్యవంతం కావాలని, అందుకు రక్షణగా నిలిచే చట్టాలు, సహాయక సేవలు, హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సిద్దిపేట జిల్లా మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ అధికారి(డీడబ్ల్యుఓ) శారద సూచించారు. గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో 'జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ', 'మిషన్ శక్తి -జిల్లా మహిళా సాధికారిక కేంద్రం' ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన "100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డితో కలిసి డీడబ్ల్యుఓ శారద పాల్గొని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. మహిళలకు సఖి సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలు, బాల్య వివాహాల పట్ల కలిగే సమస్యలు,నష్టాల గురించి వివరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్,దుబ్బాక సీఐ పీ.శ్రీనివాస్,ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్ట్ సీడీపీఓ చంద్రకళ,జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్,మెప్మా సీఓ రేణుక,మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ లు,ఆర్పీలు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని నంగునూరు తహశీల్దార్ జి. సరిత అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేలా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు తహశీల్దార్ కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, రెండవ గిర్దావర్ బాలరాజు, కంప్యూటర్ ఆపరేటర్ రాజాబాబు, ధరణి ఆపరేటర్ రాంప్రసాద్ లకు వీడ్కోలు చెప్పి వారి స్థానంలో వచ్చిన సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, రెండవ గిర్దావర్ జయసూర్య, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్, ధరణి ఆపరేటర్ నవీన్ లను విధులల్లోకి చేర్చుకున్నారు. అదేవిధంగా గత ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న నాయబ్ తహశీల్దార్ స్థానంలో నరేశ్ రెడ్డి వచ్చి, డిప్యూటేషన్ పై జిల్లా కలెక్టర్ సీసీగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

ఉన్నత పాఠశాలలో ఘనంగా శిక్షా సప్తాహ్



నవతెలంగాణ-చేర్యాల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం 2020 నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22 నుంచి 29 వరకు దేశవ్యాప్తంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె ఐలయ్య తెలిపారు. అందులో భాగంగా సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని నాగపురి జిల్లా పరిషత్ పాఠశాలలో భక్తి గీతాలు, దేశభక్తి గీతాలు, జానపద గేయాలు, నృత్యాలు, ఏకపాత్రాభినయం నాటికల లాంటివి నిర్వహించారు. ఈ నేపథ్యంలో వెయ్యికి పైగా వివిధ శతక పద్యాల కంఠస్థ పటకుడు వేణు గాన కళాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు పాశికంటి జనార్ధన్ పాఠశాలలో తన కలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. కృష్ణమూర్తి, ఏ. లక్ష్మణ్, టి. పద్మ, ఏ. విజయ్ కుమార్, టి. మనోజ్ కుమార్, ఎస్.నిరుపమ, కే. మాధవి, జి. ప్రకాష్ రెడ్డి, స్వర్ణకుమార్, ఎస్. కనక లింగం, జి. శ్రీధర్, ఫాతిమా సుల్తానా పాల్గొన్నారు.

కుకునూరుపల్లి ఉపాధ్యాయులకు బంగారు నంది అవార్డు



నవతెలంగాణ-కొండపాక : కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బంగారు నంది అవార్డులు అందుకున్నా రు. ప్రగతి ఫౌండేషన్ వారు వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు అవార్డులను ప్రదానం చేస్తారు. అందులో భాగంగా గురుపూజోత్సవం సందర్భంగా విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందించిన కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు సత్తయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డిలను ఎంపిక చేసి గురువారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డులను అందజేశారు. శాలువాతో సత్కరించి నంది అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ఫౌండేషన్ ప్రతినిధులు సినీ ఆర్టిస్టులు పిఎస్ఆర్ సంస్థ అధినేత పోల్కంపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు. నంది అవార్డును అందుకున్న ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

అక్బర్ పేట భూంపల్లి నూతన తహశీల్దార్‌గా చంద్రశేఖర్



నవతెలంగాణ-మిరుదొడ్డి: అక్బరుపేట భూంపల్లి మండలం తహశీల్దార్‌గా పి చంద్రశేఖర్ గురువారం భాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తహశీల్దార్ గా విధులు నిర్వహించారు.ఈ మండలం నుండి సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి సూపరిడెంట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లిన అహ్మద్ ఖాన్ స్థానంలో తహశీల్దార్‌గా పి చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండ లంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం ఆదాయ ధ్రువ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.

రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



- వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ

నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నిజాంపేట మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన రైతులు జూన్ 28,2024 నుంచి పట్టేదారు పాస్ బుక్ కలిగి ఉండాలన్నారు. రైతు పాస్ బుక్ ఆధార్ కార్డు జిరాక్స్ నామిని ఆధార్ కార్డు జిరాక్స్ జతపరచాలని వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలన్నారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసిందన్నారు. రెండో విడత రుణమాఫీ అమలు చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- రాష్ట బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ రెడ్డి, ప్రశాంత్
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ రెడ్డి ప్రశాంత్ లు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3 శాతం కేటాయించారని, గతం కంటే తక్కువ అన్నారు. గత బడ్జెట్ లో విద్యారంగానికి రూ 21,389 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.21,292కోట్లు కేటాయించారని, ఈ నిధులతో ప్రభుత్వ విద్య అభివృద్ధి కాదన్నారు. ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి, దాని ఊసే ఈ బడ్జెట్లో లేదన్నారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని, దాని గురించి చర్చే లేదని, యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ, 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారని, యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి నిధులు లేవన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారని, ఉస్మానియా కు 1000కోట్లు, మహిళ యూనివర్శిటీ అభివృద్ధి కోసం 500 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. సిద్దిపేటకు యూనివర్సిటీ ఆశ ఆలాగే మిగిలిందని, బాసర ఐఐటి అభివృద్ధి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులిపేసుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 11 యూనివర్శిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులురావని అన్నారు. పాఠశాల విద్యారంగ లో ఖాళీలు భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవని, గత ఆరేళ్ళ నుండి స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించలేదన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన స్పష్టమైన నిధులు లేవని అన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి, ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ-ములుగు

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లింగాల సురేష్.అన్నారు. రాష్ట్ర బడ్జెట్ 2.91,159లో విద్యా రంగానికి 21,292 (7.31%) మాత్రమే నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. బడ్జెట్లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాల్సి ఉండగా, తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీని పూర్తిస్థాయి ప్రక్షాళన చేయడానికి సుమారు 500 కోట్లకు పైగా నిధులు ఖర్చవుతుతాయని మేధావులు, విద్యావేత్తలు ముఖ్యమంత్రికి సూచించారని కానీ రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు కలిపి వాటి అభివృద్ధి పేరిట కేటాయించిన 500 కోట్లు ఏ మూలకు సరిపోతాయో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్ ను సవరించి విద్యకు 30% నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నవతెలంగాణ-గజ్వేల్

బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి దాని అడ్రస్ ఎక్కడ ప్రస్తావించలేదని గజ్వేల్ మండలం మాజీ జడ్పీటీసి డాక్టర్ పంగ మల్లేశం ప్రశ్నించారు. గురువారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కోసం రెండు మూడు రోజులుగా అసెంబ్లీలో మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లు జాబ్ క్యాలెండర్ పై ప్రభుత్వాన్ని ప్రశ్నించగా బడ్జెట్ విడుదల చేసిన రోజు ప్రకటిస్తామని సీఎం హామీ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఒక పద్దు లేదు , ఓ పద్ధతి లేదని ఆయన విమర్శించారు. రాజకీయ సభలో బట్టి విక్రమార్క మాట్లాడినట్లు అనిపించిందన్నారు.



నవతెలంగాణ-గజ్వేల్

మహిళా సంక్షేమం పట్ల సీఎం రేవంత్ రెడ్డి వివక్ష చూపుతున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుంబాల అరుణ భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆమె ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 8 నెలలుగా కేవలం ఉచిత బస్సు ప్రయాణం మినహా మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసినట్లు ఆమె విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు బడ్జెట్లో వుసే లేదని తులం బంగారం ఇచ్చిన హామీ ముఖ్యమంత్రికి గుర్తుందా అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మర్చిపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు. మహిళా సంక్షేమానికి ఇచ్చిన హామీని వెంటనే అమలు పరచాలని ఆమె డిమాండ్ చేశారు. వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు పెన్షన్ పెంచుతామని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి వాటిని కూడా మర్చిపోయారన్నారు. ఒకే ఒక్క గ్యారెంటీతో ప్రభుత్వం కొనసాగుతుందని అది మహిళలకు ఉచిత ప్రయాణమని ఆమె గుర్తు చేశారు. ఇచ్చిన 6 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆమె కోరారు.



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర బడ్జెట్ లో దళితుల జనాభా ప్రకారం నిధులేవని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీ ల జనాభా ప్రకారం రాష్ట్ర బడ్జెట్ లో 18 శాతం నిధులు 52,409 వేల కోట్లు కేటాయించాల్సి వుండగా కేవలం 33,124 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.మొత్తం రాష్ట్ర బడ్జెట్ 2,91,159 కోట్లు కాగా ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కెటాయింపుల చట్టం ప్రకారం దళితుల జనాభా 18 శాతం ప్రకారం నిధులు కేటాయించకుండా కేవలం 11 శాతం మాత్రమె నిధులు కేటాయించి చట్టాన్ని ఉల్లంఘించారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిపెస్టోలో హమి ఇచ్చినట్లు అంబేద్కర్ అభయ హస్తం పథకం గురించి ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో ప్రస్తావించలేదన్నారు. .రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడం పట్ల హర్షం ప్రకటించారు.

నవతెలంగాణ-మర్కుక్

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దామరకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయా రంగాలతో పాటు వ్యవసాయ రంగానికి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలంగాణ అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రైతులకు రుణమాఫీ చేయడం రైతులు ఎంతో ఆనందంలో ఉన్నారన్నారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులకు చేసిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంతోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతుల వెన్నుముకగా నిలిచారన్నారు. ఇంద్రమ్మ రాజ్యం తోనే ప్రతి పేదోడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గత ప్రభుత్వం అంకెల గారడితో బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఉంచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాస్తవిక బడ్జెట్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం ఆంజనేయులు, కుమార్, రవి, శంకర్ తదితరులున్నారు.



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ బడ్జెట్లో విద్యకు 21, 292 కోట్లు కేటాయించడం జరిగిందని, ఇది రాష్ట్ర బడ్జెట్లో 7.3 శాతంగా ఉన్నదని టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొఠారి విద్యా కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని, ఢిల్లీ, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం వరకు విద్యకు కేటాయించడం జరుగుతుందని, 30 శాతం వరకు నిధులు కేటాయిస్తేనే విద్యావ్యవస్థలో మంచి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం నిధుల కేటాయింపు జరగాలని, రాష్ట్ర ప్రభుత్వ ఖజానా లోటులో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం యొక్క సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈసారి బడ్జెట్ ప్రసంగంలో ఏమాత్రం ఆర్బాటాలు లేకపోవడం శుభ పరిణామం.





నవతెలంగాణ-అక్కన్నపేట

తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత మూడవసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత 2024-2025కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర యువతకు అత్యధికంగా కేటాయించడం ఆనందదాయకమని సీపీఐ మండల నాయకులు కొమ్ముల భాస్కర్ తెలిపారు. మొత్తం 2.90 లక్షల కోట్ల బడ్జెట్ లో యువత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ 72,659 కోట్లు కేటాయించడం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ హయాంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆరు గ్యారంటీ అమలుకు కృషి చేయాలన్నారు.



నవతెలంగాణ-సిద్దిపేట

మాటలేతప్ప చేతలు లేవన్నట్టుగా, విద్యారంగం పట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించిందని టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2,91,159 కోట్లలో 7.31 శాతం నిధులు కేటాయింపులు చేశారని, గత సంవత్సరం 6.56 శాతం కేటాయిస్తే , ఇప్పుడు 21,292 కోట్లు కేటాయించడం, విశ్వవిద్యాలయాలకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే 500 కోట్లు కేటాయించడం చూస్తే, విద్య పట్ల ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించనున్నదని తేటతెల్లమైందన్నారు. విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తామని, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నెలకొల్పుతామని తెలిపి, అందుకు తగిన విదంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేక గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు పెంచకపోవడంతో విద్యను ప్రైవేటురంగానికి వదిలివేసే కుట్రగా భావించాల్సివస్తోందన్నారు. అరకొర నిధులతో అందరికీ ప్రమాణాలతో కూడిన విద్య అందని ద్రాక్ష కానున్నదను, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో వాగ్దానం చేసినవిధంగా 15 శాతం కేటాయిస్తే కనీసం 44.6 వేలకోట్ల నిధులు వచ్చేవని, కాని 21,292 కే పరిమితమైందని అన్నారు. తక్కువ నిధులతో అందరికీ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదన్నారు.



మురుగు కాల్వ లు శుభ్రం చేయాలి

- కమిషనర్ గోల్కొండ నరసయ్య

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మురికి కాల్వాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో రాజిరెడ్డిపల్లి లో మురుగు కాల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో మున్సిపల్ సిబ్బంది వర్షాకాలం అయినందున తక్షణ చర్యలు తీసుకొని శుభ్రం చేయాలన్నారు. సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రతి వార్డులో ఉన్న మురికి కాల్వలో చెత్తా చెదారంను తొలగించి మురికి నీరును సక్రమంగా వెళ్లే విధంగా చూడాలన్నారు. మురికి నీరు నిలిస్తే సీజన్ వ్యాధులు వస్తాయన్నారు. ఈగలు దోమలు వాలి ఇంటిలోనికి



వెళ్తాయని ఆయన చెప్పారు. ఇంటిలో ఉన్న తిని బండారాలపై దోమలు ఈగలు వాడితే సీజన్ వ్యాధులు ఇంటిలో ఉన్న అందరికీ వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇంటి యజమానులు సైతం వారి ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల వారిగా ఉన్న సిబ్బంది వాటిని పరిశీలించి మురికిని తొలగించాలన్నారు. వార్డులను పరిశీలించిన వారిలో టిపిఓ శ్రీధర్ రెడ్డి, ఏఈ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వీది కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. గురువారం గజ్వేల్‌లో మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మున్సిపల్ పాలక వర్గం, వెటర్నరీ ఏడి రమేష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. గజ్వేల్ మున్సిపాలిటీలో 20 వార్డుల్లో అడుగడుగునా కుక్కల బెడద ఉందని పూర్తిగా నివారించేందుకు చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 5 గంటలకు వెళ్లే వాకర్స్ వెంట కుక్కలు వెంబడిస్తున్నాయని వారు చెప్పారు. అంతేకాకుండా వార్డులో ఉన్న కౌన్సిల్ సభ్యులు కూడా కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు పిల్లలు ఒంటరిగా వెళ్లాలంటే వణికి పోతున్నారని ఆయన వారు తెలిపారు. కుక్కలకు చిన్న పెద్ద తేడా లేకుండా పైకి వస్తుంటే భయాందోళనకు గురై పరుగులు తీస్తున్నారన్నారు. మున్సిపల్ శాఖ, ఇతర శాఖల కలిసి కుక్కల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు పరిశీలిస్తున్నమన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని సమాచారం ఉందని, ప్రజలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పరంగా, మున్సిపల్ అధికారులు కుక్కల పట్ల తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు, కుక్కలకు కుటుంబ నియంత్ర ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 20 వార్డుల్లో కౌన్సిల్ బృందం పర్యటించి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆలోచన చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బందితోపాటు అధికారులు, కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక చొరవ చూపి కుక్కల బెడదలు నివారించేందుకు ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయుద్దీన్, వెటర్నరీ ఏడి రమేష్, కౌన్సిలర్స్ వంటేరు గోపాల్ రెడ్డి, రహీమ్ , పంబాల అర్చన శివకుమార్, గంగిశెట్టి చందన రవీందర్, మార్కంటి వరలక్ష్మి కనకయ్య, మామిడి విద్యారాణి శ్రీధర్, బొగ్గుల చందు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో పెనవేసుకున్న బంధం శాశ్వతంగా ఉంటుంది

- పిఏసీఎస్ డైరెక్టర్ బొడిగం జ్యోతి
- బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థులతో పెనవేసుకున్న బంధం శాశ్వతంగా ఉంటుందని పిఏసీఎస్ డైరెక్టర్ బొడిగం జ్యోతి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలలో భాగంగా చేర్యాల మండల పరిధిలోని చిట్యాల ప్రాథమిక పాఠశాల నుంచి 10 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బదిలీ అయిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్. లక్ష్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పిఏసీఎస్ డైరెక్టర్ బొడిగం జ్యోతి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేవి సాధారణమైనప్పటికీ



పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు, వారితో పెనవేసుకున్న బంధం శాశ్వతంగా ఉంటుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికై గ్రామ పెద్దలు, గ్రామస్తులతో కలిసి పనిచేసిన తీరు అభినందనీమన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు పద్మ, గ్రామస్తులు పిఏసీఎస్ మాజీ చైర్మన్ బొడిగం మహిపాల్ రెడ్డి, జంబియా రాజు, జానకి స్వామి, పోలోజు జనార్ధన్, ఆకుల జంపయ్య,మ్యాక సహదేవులు,జి.సిద్దులు, అవినాష్ రెడ్డి,పిల్లి నరేష్, ప్రవీణ్, జానకి వెంకటేష్, యాదగిరి, ప్రవీణ్, ఉపాధ్యాయులు,అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రక్రియను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి

నవతెలంగాణ-కొండపాక

రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్ లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ హరిబాబుతో కలిసి దుద్దెడ యూనియన్ బ్యాంకులో రుణమాఫీ ప్రక్రియను గురువారం పరిశీలించారు. రైతులకు రుణమాఫీ అందే వివరాల రికార్డులను



పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు చింతల సుధాకర్ కు మాఫీ అయిన 68 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవి శంకర్ , కొండపాక మండల వ్యసాయాధికారి ప్రియదర్శిని, కొండపాక వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కే.ఆర్.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చీకోడు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తౌడ శ్రీనివాస్ ఇటీవల మాతృ వియోగానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కే.ఆర్.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చెక్కపల్లి రాజమల్లుతో కలిసి గురువారం



పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కి ఇరువురు మనో ధైర్యాన్ని కల్పించారు

మహిళల ఆర్థిక అభివృద్ధికై మెప్మా కృషి

- మెప్మా సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతా రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక

మహిళలు పురుషులతో సమానంగా వ్యాపార రంగంలో రాణించాలని..అందుకు వారికి కావాల్సిన రుణ సౌకర్యాన్ని, ఇతర ప్రోత్సాహకాలను అందించడమే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కృషి చేస్తుందని మెప్మా సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంతా రెడ్డి చెప్పారు. గురువారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పలు మహిళ సమైక్య సంఘాల అధ్యక్షురాల్లతో నిర్వహించిన 'మహిళ శక్తి' కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డితో కలిసి



ఆయన మాట్లాడారు. ఆసక్తి కలిగి ఉన్న రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ వ్యాపారాలకు కావలసిన పెట్టుబడి రుణాలను బ్యాంకులు,శ్రీనిధి ద్వారా రూ.1 నుంచి రూ.20 లక్షల వరకు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ సదవకాశాన్ని మహిళలు వినియోగించుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్,మెప్మా సీవో రేణుక,పలు మహిళ సమాఖ్యల అధ్యక్షురాల్లు, మెప్మా రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

సీసీ పుటేజ్ ఇవ్వడం అసాధ్యం అనడం ఏసీపీకి సరికాదు

ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్



నవ తెలంగాణ-సిద్దిపేట

ఓ కేసు విషయంలో సమాచార హక్కు చట్టం ద్వారా ఏసీపీ, వన్ టౌన్, రూరల్ పీఎస్ ల సీసీ టీవీ ఫుటేజ్, ఆయా కార్యాలయాల పరిధి వెయ్యి మీటర్ల వరకు సీసీ పుటేజ్ కోసం దరఖాస్తు చేయగా, సీసీ పుటేజ్ ఇవ్వడం అసాధ్యం అనడం ఏసిపికి సరికాదని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీపీ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు దశలో ఉన్నట్లు, పోలీస్ స్టేషన్ ల పరిధిలో సీసి పుటేజ్ ఇవ్వడం సాధ్యం కాదని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొవాలని సుప్రీం కోర్టు ఇచ్చిన గైడ్ లైన్స్ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరును సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ దృష్టికి తీసుకెళ్తా అన్నారు. అదే విధంగా ఈ విషమమై హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు. ఆయా కార్యాలయాల పరిధిలో అనుకొని సంఘటనలు జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారని సూటిగా ప్రశ్నించారు. ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద 11 సీసీ కెమెరా రాలు ఉండాలని నిబంధనలు ఉన్నట్లు తెలిపారు. తనకు సుడా చైర్మన్ పదవి వచ్చే అవకాశం ఉన్నందున, అక్రమ కేసులో తనను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉందని, అలాంటి కుట్రలకు పాల్పడితే చట్ట పరంగా కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏసీపీ స్థానంలో డైనమిక్ ఆఫీసర్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావుపై అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో ఆరుగురిపై కేసు నమోదు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్:

ఇంటి నెంబర్ మార్చి ఓపెన్ ప్లాటును కాజేయాలని ఉద్దేశంతో తప్పుడు పత్రాలు సృష్టించిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిద్దిపేట వన్ టౌన్ సిఐ లక్ష్మీబాబు తెలిపారు. ఆయన తెలిపిన విరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన విశ్వంత్ నందీశ్వరి భర్త నాగేశ్వర్, దొమ్మాట మధుసూదన్ రెడ్డి తో కలసి శివాజీ నగర్ లో చాలా ఏళ్ల క్రితం 744 గజాల విస్తీర్ణంలో ఓపెన్ హౌస్ ప్లాట్ ను కొనుగోలు చేసి అందులో బిల్డింగ్ కట్టుకుని ఓ ప్రైవేట్ స్కూల్ ను నడిపించారు. ఆ బిల్డింగ్ పాతది కావడంతో, కోత్తది కట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ బిల్డింగ్ ను కూల్చివేసారు. ఈమధ్య కాలంలో కోత్త బిల్డింగ్ కట్టుకోవడానికి మున్సిపాలిటీ పర్మిషన్ కూడా తీసుకున్నారు. కాగా ఆ భూమిపై కన్నేసిన సిద్దిపేట పట్టణానికి చెందిన బాదరవేణి యాదవ్వ, మిద్దె రవీందర్, మరుపల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకం లక్ష్మణ్, మరుపల్లి యాదగిరి, మర్కంటి శ్వేత లు, విశ్వంత్ నాగేశ్వర్ చనిపోవడంతో అతనికి చెందిన 325 గజాల స్థలంలో ఉన్న కారు షెడ్డుపై తప్పుడు ఇంటి నెంబర్ వేసి, బాదరవేణి యాదవ్వను ఫోటోలు దించి జాగాకు తప్పుడు పత్రాలను సృష్టించి ఆరుగురి పేర్ల పై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తరువాత అయిదుగురు కలిసి మార్కంటి శ్వేత పేరుపై రిజిస్ట్రేషన్ చేసారు. దీంతో విషయం తెలుసుకున్న విశ్వంత్ నాగేశ్వర్ బార్య నందీశ్వరి ఆరుగురు నిందితులపై ఇచ్చిన పిర్యాదే మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొంతాన్ పల్లిలో వెంకట్రాంరెడ్డి ఆర్థికసాయం

నవతెలంగాణ-నర్సాపూర్ : నిత్యం బాధిత కుటుంబాలకు ఆర్థిక సహకారాలను అందించే శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి మండలంలోని కొంతాన్ పల్లి గ్రామంలో మరో కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం జరిగినది. గ్రామానికి చెందిన పెద్దిపల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో గురువారం మరణించగా విషయం తన సహచరుల ద్వారా పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ఓదార్చారు బాధిత కుటుంబానికి తనవంతు సహాయంగా తన స్వంత డబ్బులు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పీఏసీఎస్ తరుపున మరో 5 వేల రూపాయలు అందజేత

కొంతాన్ పల్లిలో మరణించిన పెద్దిపల్లి లక్ష్మమ్మ కొడుకు పెద్దిపల్లి బిక్షపతి శివ్వంపేట కో ఆపరేటివ్ బ్యాంకులో ఎన్నో సంవత్సరాలుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నందున బిక్షపతి సోదరున్ని గురువారం పరామర్శించి, సోసైటీ బ్యాంకు తరుపున చైర్మన్ వెంకట్రాంరెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ పెద్దిపల్లి లక్ష్మమ్మ మరణించడం ఎంతో బాధాకరమని, పెద్దిపల్లి బిక్షపతి కుటుంబానికి మరింత సహకారం తప్పకుండ అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ బ్యాంకు సీఈఓ మధు యాదవ్, రవీందర్ రెడ్డి, గుండు శంకర్, కుల్ల వెంకటేష్, పెద్దిపల్లి రాములు, బొల్లారం భాను, కాళ్లకంటి నాగరాజు, పెద్దిపల్లి శ్రీకాంత్, బ్యాగరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



నవతెలంగాణ -నర్సాపూర్

నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం మెదక్ జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సందర్శించారు ఈ సందర్భంగా నర్సాపూర్ పోలీస్ సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన ఎస్సై లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ లలో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, సీఐ జాన్ రెడ్డి ఆయా మండల ఎస్సైలు నర్సాపూర్ మండల ఎస్సై పుష్ప రాజ్ కౌడిపల్లి మండల ఎస్సై రంజిత్ కుమార్, చిలిపిచెడ్ మండల ఎస్సై షేక్ మహబూబ్ లు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లతో ప్రజలకు దక్కింది ఏమీ లేదు

నవతెలంగాణ-నార్సింగి



అటు కేంద్ర బడ్జెట్, ఇటు రాష్ట్ర బడ్జెట్‌తో తెలంగాణ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు విమర్శించారు. మండల కేంద్రం లో గురువారం బాబు విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్రం నుంచి దేశాన్ని పాలిస్తున్న బీజేపీ కి చెందిన ఎనిమిది మంది ఎంపీ లు, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి ఎనిమిది ఎంపీలు ఉన్నా తెలంగాణా కు బడ్జెట్‌లో దక్కించుకున్నది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకం తో ఎన్నుకున్న ఎంపీలు రాష్ట్రానికి తెచ్చింది గుండు సున్నా అని మండి పడ్డారు. రెండు పార్టీల నాయకులు పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్నికలలో గెలవడానికి చెప్పిన గాలి మాటలని, బూటకపు హామీలని తేలిపోయిందన్నారు. గురువారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశల పై నీళ్ల జల్లినట్టు ఉందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో ఒక్క కొత్త సంక్షేమ పథకం కూడా ప్రకటించలేదని, యాదవులు మత్స్యకారులను పట్టించున్న పాపాన పోలేదని అన్నారు. రైతు భరోసా లో అనేక ఆంక్షలను పెట్టి రైతులకు వంచించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక నైజాన్ని మరోసారి బయట పెట్టిందని అన్నారు. దళిత బంధు పథకం ఊసెత్త లేదని, దళితుల పై వారికి ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిందని, బడ్జెట్ ఒట్టి డొల్ల అని, పేదల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రకటించలేదని, ప్రజల్ని నమ్మించి మోసం చేసిందని వాపోయారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పది సంవత్సరాలు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించి దేశానికే ఆదర్శంగా నిలిపిన రాష్ట్రాన్ని, కాంగ్రెస్ తన హయాంలో అభివృద్ధిలో వెనక్కు నెట్టుతుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల అమలు పై ఎలాంటి కేటాయింపులు జరగలేదని, రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఉరోకోదని ఈ సందర్భంగా మైలారం బాబు హెచ్చరించారు.

రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయే ప్రజా సంక్షేమ బడ్జెట్

నవతెలంగాణ-నార్సింగి



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024-25 రాష్ట్ర చరిత్రలోనే ప్రజా ప్రయోజన బడ్జెట్‌గా నిలిచిపోతుందని కాంగ్రెస్ నాయకుడు ఎన్నం రాజేందర్ రెడ్డి కొనియాడారు. బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తీరు ప్రశంస నీయ మన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు 72 వేల కోట్లు, నీటి పారుదల శాఖకు 22 వేల కోట్లు కేటాయిం చడం వ్యవసాయ రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న మమకారాన్ని తెలుపుతుందని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం 9 వేల కోట్లు, మైనారిటీ 3 వేల కోట్లు, ఎస్సి 33 వేల కోట్లు, ఎస్టీలకు 17 వేల కోట్లు కేటాయించడం ముఖ్య మంత్రి అనుముల రేవంత్ రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని రంగాలకు పెద్దపీట వేస్తూ ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యతను ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ మాట మీద నిలబడే తత్వానికి నిదర్శనం అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించ నుండడం, సన్న వడ్లు పండించే రైతులకు బోనస్‌గా రూ.500లు చెల్లించడం హర్షనీయమని అన్నారు. ప్రజా ప్రయోజన బడ్జెట్ 2024-25ను ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఈ సందర్భంగా మండల, రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

తెలంగాణ బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ నిరసన



నవతెలంగాణ-సంగారెడ్డి

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను నిరాకరిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో ట్రైన్ కావాలని కోరితే పటాన్చెరు వరకే బడ్జెట్లో ప్రవేశపెట్టడం చాలా దురదృష్టకరమని అని అన్నారు. 6 గ్యారంటీ లో ఊసే లేదు అని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేశ్వరరావు దేశ్పాండే, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు, సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జగన్, అధికార ప్రతినిధి రాజు గౌడ్, జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్, జహీరాబాద్ మాజీ టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, కౌన్సిలర్స్ మందుల నాగరాజు, శంషాబాద్ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్, రాష్ట్ర జిల్లా అసెంబ్లీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో అల్లిబిల్లి బాలనర్సయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.పేద కుటుంబ పరిస్థితి గురించి కాంగ్రెస్ నాయకులు ఫోన్ లో ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ కు తెలిపారు.స్పదించిన చక్రధర్ గౌడ్ మృతుని కుటుంబానికి క్వింటల్ బియ్యాన్ని పంపించారు.వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారని నంగునూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోనెపల్లి శివ ప్రసాద్ గౌడ్ తెలియజేశారు. నీల రాకేష్, సాయిశ్యామ్, అఖిల్, శివకుమార్, నీల చందు తదితరులు పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా గజస్తంభ ప్రతిష్టాపన

- పెద్ద ఎత్తున హాజరైన కాలనీవాసులు భక్తులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో గల పోచమ్మ తల్లి దేవాలయం ముందు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని నూతనంగా గజస్తంభ ప్రతిష్టను గురువారం అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆషాడం మాసం పురస్కరించుకొని ఈనెల 29 అంబేద్కర్ కాలనీలో గల పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారని తెలిపారు. బోనాల ఉత్సవాలకు కాలనీవాసులు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి దీవెనలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బిక్షపతి, సర్వేశ్, వీరుడు చంద్రయ్య , బబ్బురి కృష్ణ, జలంధర్, శ్రీనివాస్, మహేష్, శివ, రాములు, రాములు, మల్లేశం, కుమార్, గుమ్మడి పోచయ్య, నరేష్, బాలరాజ్, నరేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలి



నవతెలంగాణ-మనోహరాబాద్

మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక దృష్టిని పెట్టాలని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లినట్టు మనోహరాబాద్ మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు భాష బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్‌లు తెలిపారు. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ నార్త్ బ్లాక్‌లో గల బండి సంజయ్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకముగా వారిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు పోలీసు శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలంలోని మక్క రాజుపేట గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జింక స్వామి అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్, యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం యువజన నాయకుడు సాయి కుమార్ గౌడ్, గ్రామ అధ్యక్షులు కొండారెడ్డి, నాయకులు రాజారాం, బెస్త రాజయ్య, రాజు, మాజీ మండల సమన్వయ రైతు అధ్యక్షుడు జింక శ్రీనివాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు..